

# సూర్య

నేటి దినపత్రిక

www.suryaa.com

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం,1 ఆగస్టు 2025

8 పేజీలు


### అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే

# ఉపేక్షించేది లేదు

- అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలి
- టిడ్‌కో గృహాల్లో సమస్యలను తక్షణమే పరిష్కరించాలి
- అధికారులకు రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదేశాలు



**రామచంద్రపురం,మేజర్‌న్యూస్ :** ప్రజలకు సేవలు అందించాల్సిన అధికారులు విధుల్లో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని, అధికారులు ప్రజలకు జవాబుదారితనంగా ఉండాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ హెచ్చరించారు. గురువారం రామచంద్రపురం పట్టణంలోని ఒకటో వార్డులో ఉన్న టిడ్ కో గృహ సముదాయంలో అధికారులతో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ టిట్కో గృహాల్లో ఉన్న సమస్యలపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సహించబోమని అన్నారు. అంతిమంగా ప్రజలు ఇబ్బందులు పడకూడదనే నినాదంతో వివిధ శాఖల అధికారులు పని చేయాలన్నారు. ముఖ్యంగా త్రాగునీరు కోసం వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు పూర్తి చేసి త్వరగా మంచినీరు అందించాలన్నారు. అలాగే గృహ సముదాయాల్లో పారిశుధ్య పనులు, స్లాబ్ లీకేజీ పనులు, వాటర్ పైప్ లైన్లు తక్షణమే సరిచేసి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. టిడ్ కో గృహ సముదాయంలో రేషన్ షాప్ పాయింట్ ఏర్పాటు చేసి నిత్యవసర వస్తువులు పంపిణీ చేయాలని ఆదేశించారు. శానిటేషన్ సిబ్బంది కొరత ఉంటే తాత్కాలిక పద్ధతిన నియమించుకునే అవకాశం చూడాలని సూచించారు. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలోనే గతంలో 1088 టిడ్ కో గృహాలు నిర్మించి ఇచ్చామన్నారు. ప్రస్తుతం మూడో విడత కింద 960 గృహాలు నిర్మాణ దశలో ఉన్నాయని, వాటిని త్వరలోనే లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. మంత్రిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత ప్రధాన సమస్యల పరిష్కారానికి ప్రణాళిక బద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. ప్రజల కోరిక మేరకు రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో భోజనం పంపిణీ చేసే కాంట్రాక్టర్ను మార్చామని ఉదహరించారు. గత ప్రభుత్వం చేసిన ఆర్థిక తప్పిదాలు వల్ల రాష్ట్రం అధోగతి పాలైంది అన్నారు. వైసిపి 10 లక్షల కోట్ల మేర అప్పులు పాలు చేసి, రాష్ట్రంలో అభివృద్ధి లేకుండా చేశారన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా కమీషన్లకు కక్కుర్తి పడి పరిశ్రమలు ఇతర ప్రాంతాలకు తరలిపోయేలా అడ్డుకున్నారని ఆరోపించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం

- తరువాయి 2లో..

## నేడు రైతులకు

# అన్నదాత సుఖీభవ...

- రూ.7000 చొప్పున రైతుల ఖాతాలకు జమ
- ఒక లక్ష 13 వేల మంది రైతులకు రూ.55 కోట్ల లబ్ధి



**రాజమహేంద్రవరం,మేజర్‌న్యూస్ :** రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని, అన్నదాత సుఖీభవ–పీఎం కిసాన్‌పథకాల కింద మంజూరైన నిధులను రేపు (ఆగస్టు 2న) అర్హులైన రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమచేయనున్నట్లు తూర్పుగోదావరిజిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన ప్రతి రైతు ఖాతాలో రూ.7,000 చొప్పున, జిల్లా వ్యాప్తంగా మొత్తం రూ.79 కోట్లు నేరుగా ఈ విడత లో రైతుల ఖాతాల్లో జమచేయనున్నట్టు తెలిపారు. రూ.7,000 మొత్తంలో రూ.2,000 పీఎం కిసాన్ కింద కేంద్ర ప్రభుత్వం అందిస్తుండగా, రూ.5,000 అన్నదాత సుఖీభవ కింద ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం

- తరువాయి 2లో..



### రావులపాలెంకు కలసి వచ్చిన

## వాడపల్లి పుణ్యక్షేత్రం

- శుక్ర,శని,ఆదివారాల్లో పండగే పండగ
- దూసుకుపోతున్న హొటల్స్ రంగం
- చిరు వ్యాపారులు,ఆటో కార్మికులకు ఉపాధి

- తరువాయి 4లో..

### ఆగస్టు నెల ఎన్టీఆర్ భరోసా పింఛన్లు

# పంపిణీకి సర్వం సిద్ధం..

- జిల్లాలో 2.73 లక్షల మందికి రూ.118.27 కోట్ల ఫించను సొమ్ము పంపిణీకి పటిష్ట ఏర్పాట్లు
- జిల్లాలో అదనంగా 4,763 మందికి స్పౌజ్ ఫించన్ల మంజూరి
- తొలిరోజే నూరు శాతం ఫించన్ల పంపిణీకి అధికారులు కృషి చేయాలి – జిల్లా కలెక్టర్

**కాకినాడ,మేజర్‌న్యూస్ :** జిల్లాలో ఆగస్టు 1న ఎన్టీఆర్ భరోసా ఫించను పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కాకినాడ జిల్లా కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. గురువారం ఆయన క్యాంపు కార్యాలయం నుంచి అన్ని మండల, మున్సిపల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు సామాజిక భద్రత కింద జిల్లాలో ఎన్టీఆర్ భరోసా ఆగస్టు నెలలో అవ్వ తాతలకు, దివ్యాంగులకు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఇతర పింఛనుదారులకు సొమ్ము ఇచ్చేందుకు సర్వం సిద్ధం చేశామన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో ఆగస్టు నెల ఎన్టీఆర్ భరోసా ఫించను కింద 2,73,065 మందికి రూ.118.27 కోట్లు పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. జిల్లాలో అదనంగా మరో 4,763 మందికి స్పౌజ్ ఫించన్లు మంజూరు అయ్యాయని జిల్లా కలెక్టర్‌తెలిపారు. జిల్లాలోనూతనంగా మంజూరు అయిన స్పౌజ్ ఫించన్లు పంపిణీ చేసే సమయంలో



సంబంధిత ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని ఆయన సూచించారు. ఫించను దారుల సమావేశ పరిచి ఫించను పంపిణీ చేయడానికి ఏపీఎం, సీసీలు,సచివాలయ సిబ్బందికి సహకరించాలని ఆయన సూచించారు. ఎన్టీఆర్

- తరువాయి 2లో..

### పీ4లో అర్హుల వివరాలు సేకరణ

## వేగవంతం చేయాలి - ఎమ్మెల్యే రాజప్ప

**పెద్దాపురం,మేజర్‌న్యూస్ :** గురువారం పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయంలో పీ4 సర్వే, అర్హుల వివరాలు, మార్గదర్శకులపై ఆర్డీఓ కె.శ్రీరమణి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదిగా పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పాల్గొని మాట్లాడుతూ, పీ4లో సరైన అర్హుల వివరాల సేకరణ సర్వే అనంతరం ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం వ్యాపారవేత్తలు, సమాజంలో ఆర్థికంగా ఉన్నతస్థానాలలోఉన్నవారిని, పారిశ్రామిక వేత్తలను గుర్తించి, వారికి దత్తత ఇవ్వడానికి తగిన మార్గదర్శకాలు, సూచనలపై ఎమ్మెల్యే రాజప్ప పలు సూచనలు చేశారు.దీనిలో భాగంగా 3ఎకరాల భూమి



కంచి పీఠం వారి ఆధ్వర్యంలో వేదపాఠశాల నిర్మాణం గురించి, 2 ఎకరాలు పీ4లో ఓల్డేజ్‌హోమ్ నిర్మాణం గురించి, మార్కెట్ యార్డ్ నిర్మాణానికి 20 సెంట్లు స్థలం, అగ్రికల్చర్ ఆఫీస్

- తరువాయి 2లో..

# ఫార్మా- అకడమిక్‌లతో స్థిరమైన అభివృద్ధి

–వీసీ ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ




రాజానగరం, మేజర్ న్యూస్ : ఔషధ పరిశ్రమ ఆవిష్కరణలపై అభివృద్ధి చెందుతుందని, అలాగే పరిశోధన సామాజిక అవసరాలను తీర్చినప్పుడు విద్యారంగం ఔచిత్యాన్ని పొందుతుందని, ఫార్మా–అకడమిక్ ఈ రెండు స్థిరమైన అభివృద్ధికి అవసరమని వీసీ ఆచార్య ఎస్. ప్రసన్నశ్రీ అన్నారు. గురువారం ఆదికవి నన్నయ యూనివర్సిటీలో "ఫార్మా – అకడమిక్ సినర్జీ ఫర్ సస్టైనబుల్ గ్రోత్" అనే అంశంపై ఇంటర్నేషనల్ వర్క్ షాప్‌ను నిర్వహించారు. ఇంటర్నేషనల్ వర్క్ షాప్ కన్వీనర్ గా ఆచార్య బి. జగన్మోహన్ రెడ్డి, కో కన్వీనర్ గా డా.కె.దీప్తి వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వీసీ ఆచార్య ఎస్ ప్రసన్నశ్రీ హాజరై జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ స్థిరమైన ఆవిష్కరణలను పెంపొందించడానికి ఫార్మాస్యూటికల్ పరిశ్రమ మరియు విద్యా పరిశోధన కలిసే అత్యాధునిక అవకాశాలు మరియు సహకార మార్గాలను కనుగొనవచ్చునన్నారు. ఇటువంటి వర్క్‌షాప్ విద్యా మరియు పరిశ్రమల నుండి ప్రముఖ వ్యక్తులను ఒక్కచోటకు చేర్చే వేదిక అవుతుందన్నారు. అంతరాలను తగ్గించడం, అర్ధవంతమైన సంభాషణ, ఆచరణాత్మక అభ్యాసం మరియు వ్యూహాత్మక భాగస్వామ్యాలను నడిపించడం లక్ష్యంగా నిర్వహించాలన్నారు. ఔషధ ఆవిష్కరణ, పర్యావరణ స్థిరత్వం మరియు సాంకేతిక పురోగతిలో పెరుగుతున్న సంక్లిష్టతలతో, విశ్వవిద్యాలయాలు మరియు ఔషధ పరిశ్రమల మధ్య భాగస్వామ్యం తప్పనిసరిగా ఉండాలన్నారు. ఫార్మా ఆవిష్కరణలతో ముందుకు సాగుతున్న ఎన్నో సవాళ్లు ఎదుర్కోవలసి వస్తుందన్నారు. అయినప్పటికి ఫార్మా ఇండస్ట్రీ గ్రీన్ కెమిస్ట్రీ లేదా సరసమైన ఆరోగ్య సంరక్షణపై దృష్టి పెట్టాలన్నారు. తరువాత అమెరికా నుండి ఫార్మాస్యూటికల్స్ క్వాలిటీ అస్యూరెన్స్ డైరెక్టర్ డాక్టర్ విష్ణు మారిశెట్టి ఆన్లైన్ లో ఫార్మా – అకడమిక్ సినర్జీ ఫర్ సస్టైనబుల్ గ్రోత్ అనే అంశంపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ అందించారు. అలాగే వక్తలు ఐఐటి మద్రాస్ నుండి ప్రొఫెసర్ బీరయ్య బైరీ హాజరై గ్రీన్ కెమిస్ట్రీ పై ప్రసంగించారు. బయో ఎన్రికో సొల్యూషన్స్ డైరెక్టర్ డాక్టర్ బి. సతీష్ మోహన్ పరిశ్రమల పనితీరు అవకాశాలు అనే అంశంపై మాట్లాడారు.

పర్యూ లైఫ్ సైన్సెస్ గ్రూప్ చీఫ్ హెచ్.ఆర్. ఆఫీసర్ ఇండియా అండ్ యూకే ఆపరేషన్స్ హెడ్ డా.కుమార్ రాజా చిట్టూరి మాట్లాడుతూ ఫార్మా రంగంలో మానవ వనరుల ఆవశ్యకత మరియు నైపుణ్యాభివృద్ధిపై చర్చించారు. తరువాత అతిథులను సన్మానించి జ్ఞాపికలను అందజేసి అభినందించారు. సాయంత్రం ముగింపు కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కె.వి.స్వామి మాట్లాడుతూ సృజనాత్మక ఆలోచనలు వెలికితీయడానికి ఇటువంటి ఆలోచనలు దోహదపడతాయని అన్నారు. కన్వీనర్ ఆచార్య బి. జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ యూనివర్సిటీలో ఇంటర్నేషనల్ వర్క్ షాప్ నిర్వహణకు సహకరించిన వీసీ ఆచార్య ఎస్ ప్రసన్నశ్రీ కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పోష్ ఎక్ట్‌పై ప్రతి మహిళ అవగాహన కలిగి ఉండాలి

– ప్రిన్సిపల్ డా.సునీత




**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** మహిళా సాధికారిత కమిటీ ఆధ్వర్యంలో పోష్ ఎక్ట్ పై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్య క్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డా.డి.సునీత అద్యక్షత వహించి పనిచేసే ప్రదేశాలలో మహిళల పై లైంగిక దాడులు జరగకుండా చూడాల్సిన భాధ్యత ప్రతి ఒక్కరి పై ఉన్నదని ఈ లైంగిక దాడుల గూర్చి ప్రొటెక్షన్ ఒఫ్ సెక్సువల్ హర్రస్మెంట్ ఎక్ట్ (పోష్) ఉన్నదని విషయం ప్రతి విద్యార్ధి తెలుసుకోవాలని,అవసరమైనప్పుడు భయపడకుండా ఇంటర్నల్ కమిటీకి తెలియపరచాలని స్వేచ్ఛ, సురక్షితమైన వాతావరణంలో బ్రతికే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని దాన్ని వినియోగించుకోవాలని కోరారు.అదే విధంగా అపరిచిత వ్యక్తులతో పరిచయాలు పెంచుకోవద్దని, మోసాలకు గురి కాకుండా జాగ్రత్తగా ఉండాలని తెలియపరిచారు.ఏలేశ్వరం అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీసు నూక రాజు మాట్లాడుతూ ఏమైనా ఇబ్బంది కలిగినప్పుడు మీ ఇంటర్నల్ కమిటీ కీ తెలియపరిచి ఉండాలని,తరువాత సమాచారం సంబందిత పోలీసు స్టేషన్‌లో ఇవ్వాలని కోరారు.ఈకార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కె. వేంకటేశ్వరరావు,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా.ప్రయాగ మూర్తి ప్రగడ, అధ్యాపకులు కె.సురేష్, డా.మదీనా, డా.శివ ప్రసాద్, విమెన్ ఎమ్పొవెర్మెంట్ కన్వెనర్ లక్ష్మి, వీరభద్ర రావు, డా. బంగార్రాజు, సతీశ్, రాజేశ్, ఉమెన్ ఎమ్పొవెర్మెంట్ సభ్యులు కుమారి మేరీ రోజలీనా, పుష్పా, అధ్యాపకేత సిబ్బంది,పెద్ద సంఖ్యలో విద్యార్దిని విద్యార్దులు పాల్గొన్నారు.

# ఆగస్టు నెల ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీకి సర్వం సిద్ధం..

మొదటిపేజి తరువాయి

భరోసాను గత జూలై నెల మాదిరిగానే ఆగస్టు ఒకటవ తేదీన గురువారం ఉదయం 7 గంటల నుంచే సచివాలయం సిబ్బంది ఫించను దారుల ఇంటి వద్దనే సొమ్ము అందజేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఇందుకు కిందిస్థాయి సిబ్బందికి స్పష్టమైన సూచనలు జారీ చేశామన్నారు.జిల్లాలో మండలాల వారీగా ఫించను దారులు సంఖ్య, సొమ్ము పంపిణీ వివరాలు : గండేపల్లి మండలం 8429 మందికి రూ. 3.68 కోట్లు, గొల్లప్రోలు మండలం 7680 మందికి రూ.3.35 కోట్లు, గొల్లప్రోలు అర్బన్ 2867 మందికి రూ.1.23 కోట్లు, జగ్గంపేట మండలం 12027 మందికి రూ.5.31కోట్లు, కాజులూరు మండలం 9954 మందికి రూ.4.28 కోట్లు, కాకినాడ రూరల్ 18282 మందికి రూ.7.86 కోట్లు, కాకినాడ అర్బన్ 29544 మందికి రూ.12.83 కోట్లు, కరప మండలం 11339 మందికి రూ.4.91 కోట్లు, కిర్లంపూడి మండలం 11132 మందికి రూ. 4.95 కోట్లు, కోటనందూరు 7726 మందికి రూ.3.35 కోట్లు, కొత్తపల్లి 12 495 మందికి రూ. 5.26 కోట్లు, పెదపూడి మండలం 10 574 మందికి రూ. 4.31 కోట్లు, పెద్దాపురం 11620 మందికి రూ. 4.97 కోట్లు, పెద్దాపురం అర్బన్ 6039 మందికి రూ.2.61 కోట్లు, పిఠాపురం 11045 మందికి రూ.4.69 కోట్లు, పిఠాపురం అర్బన్ 5670 మందికి రూ.2.46 కోట్లు, ప్రత్తిపాడు 11539 మందికి రూ.5.05కోట్లు, రౌతులపూడి 7962 మందికి రూ.3.47 కోట్లు, సామర్లకోట మండలం 11616 మందికి రూ.4.97 కోట్లు, సామర్లకోట అర్బన్ 6270 మందికి రూ. 2.73 కోట్లు, శంఖవరం 7555 మందికి రూ.3.25 కోట్లు, తాళ్ళరేవు 11458 మందికి రూ.4.92 కోట్లు, తొండంగి మండలం 12430 మందికి రూ.5.46 కోట్లు, తుని మండలం 12261 మందికి రూ.5.34 కోట్లు, తుని అర్బన్ 5330 మందికి రూ.2.36 కోట్లు, ఏలేశ్వరం మండలం 6661 మందికి రూ. 2.95 కోట్లు, ఏలేశ్వరం అర్బన్ 3697 మందికి రూ.1.62 కోట్లు. జిల్లా మొత్తం మీద 27 3065 మందికి రూ.118.27 కోట్లు, జిల్లాలో నూతనంగా మంజూరి అయిన స్పౌజ్ ఫించన్లకు సంబంధించి 4763 మందికి రూ.1.90 కోట్ల రూపాయలు ఆగస్టు 1వ తేదీన పంపిణీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి వివరించారు. జిల్లాలో ఎన్టీఆర్ భరోసా ఫించను తొలి రోజే నూరు శాతం పంపిణీ చేసేలా అధికారులు.. కింది స్థాయి సిబ్బందితో సమన్వయం చేసుకుని ఫించన్ల పంపిణీ విజయవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

# అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదు

మొదటిపేజి తరువాయి

పవన్ కళ్యాణ్, ఐటీ మంత్రి నారా లోకేష్‌ల కృషితో ఎనిమిది లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, తద్వారా లక్షలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కలుగుతాయి అన్నారు. ప్రజల ఆరోగ్యం కోసం పార్కులను ఆధునికరించి ఆహ్లాదకరమైన వాతావరణము కలిగిస్తామన్నారు. కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ ప్రభుత్వ అభివృద్ధిలో ప్రజలు భాగస్వామ్యం కావాలని అన్నారు. గృహ సముదాయాల సమస్యలు మంత్రి సుభాష్ దృష్టికి తీసుకెళ్లగా, తక్షణం స్పందించి అధికారులనే ప్రజల వద్దకు రప్పించి ప్రజల సమక్షంలో సమస్యల పరిష్కారానికి కృషి జరిగిందని ఆనందం వ్యక్తం చేశారు. గృహాల కోసం రుణాలు తీసుకుని ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారుల పక్షాన సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి సమస్యను తీసుకెళ్లేలా మంత్రి సుభాష్‌కు ప్రజల పక్షాన విన్నవించామని త్వరలోనే సమస్యకు ఒక పరిష్కారం లభించ నుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజు, డిఈ శ్రీకాంత్, టిట్కో ఎస్ఈ శేషగిరి, టౌన్ ప్లానింగ్ అధికారులు, ఎమ్మెస్ఓ, సిఎల్‌టిసి బిందు, రామచంద్రపురం నియోజకవర్గ పరిశీలకులు కాకినాడ రామారావు, పట్టణ అధ్యక్షులు శివ, వార్డు కౌన్సిలర్, నియోజవర్గ మహిళ అధ్యక్షురాలు జాస్తి విజయలక్ష్మి, సీనియర్ నాయకులు గరికపాటి సూర్యనారాయణ, పలువురు కూటమి పార్టీ నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# నేడు రైతులకు అన్నదాత సుఖీభవ...

మొదటిపేజి తరువాయి

రూ.ఆరు వేలు,రాష్ట్ర ప్రభుత్వం రూ.14 వేలు చొప్పున సంవత్సరానికి మొత్తం రూ.20,000 లను మూడు విడతల్లో నేరుగా రైతుల ఖాతాల్లో జమ చెయ్యడం జరుగుతుందని తెలిపారు.

**–జిల్లాలో ఈ విడతలో...** అన్నదాత సుఖీభవ పథకం కింద ఒకొక్కరికి రూ.5 వేలు చొప్పున 1,13,000 మంది రైతులకు రూ.55 కోట్లు , పీఎం కిసాన్ యోజన పథకం కింద ఒక్కొక్కరికి రెండు వేలు చొప్పున 1,20,000 మంది రైతులకు రూ.24 కోట్ల మేర రైతులకు ప్రయోజనం కలిగించ నున్నట్లు వెల్లడించారు. అయితే ఈ నిధులు సకాలంలో అందేందుకు, రైతుల బ్యాంక్ ఖాతాలు NPCI (నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా)తో అనుసంధానమై ఉండటం తప్పనిసరి అని అన్నారు. తూర్పు గోదావరి జిల్లాలో 1,434 ఖాతాలు చీూజ×తో అనుసంధానం కాలేదు, మరో 1,072 ఖాతాలు అనుసంధానమైనా "ఇన్‌ఆక్టివ్"గా ఉన్నాయనీ జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. కనుక రైతులు ఈ కేవైసి చేసుకోవాలని కోరారు. రైతుల ఖాతాలకి జమ కాకపోవడం నేపథ్యంలో ఆధార్ కార్డు నెంబర్ తప్పుగా వేరొక ఖాతాకి అనుసంధానం కావడం, ఈ కేవైసి కాకపోవడం, బ్యాంకు ఖాతా మనుగడలో లేక పోవడం తదితర కారణాలను గుర్తించడం జరిగిందని కలెక్టర్ పి ప్రశాంతి తెలిపారు.

అర్హత లేనీ వారు పరిశీలించుకోండి:

–సాగు భూమిని వ్యవసాయేతర అవసరాలకు మార్చిన వారు
–ఆదాయపు పన్ను చెల్లించే వ్యక్తులు
–గ్రూప్ డి కాని కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వాల ప్రస్తుత, విశ్రాంత ఉద్యోగులు
–రాజ్యాంగబద్ధ పదవులు నిర్వహించిన వారు, నిర్వహిస్తున్న వారు
–ఎంపీలు, ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు –ఈ పథకాలకు అర్హులుకారు.

రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు నిధుల విషయంలో ఏమైనా సందేహాలు, సమస్యలు ఉంటే..

సమీకృత కాల్ సెంటర్: 155251, వాట్సాప్ గవర్నెన్స్ నెంబర్: 95523 00003, స్థానిక రైతు సేవా కేంద్రాలను సంప్రదించవచ్చు అని కలెక్టర్ తెలిపారు.

# పీ4లో అర్హుల వివరాలు సేకరణ వేగవంతం చేయాలి - ఎమ్మెల్యే రాజప్ప

మొదటిపేజి తరువాయి

నిర్మాణానికి 10 సెంట్లు స్థలం, పెద్దాపురం పట్టు చేనేతను ప్రమోట్ చేయడానికి షోరూం నిర్మాణానికి 5సెంట్లు స్థలం,మహారాణి కళాశాలలో ఖాళీగా ఉన్న హాస్టల్ భవనాన్ని బిసి మహిళా హాస్టల్‌కు కేటాయించడం గురించి,పెద్దాపురం ఏరియా ఆసుపత్రికి ఒక సర్జన్ మరియు, ఎండి జనరల్ మెడిసిన్‌ను నియమించడం గురించి సమీక్షించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ రాజా సూరిబాబురాజు, తహశీల్దార్లు సిహెచ్.వెంకటలక్ష్మీ, ఎంపిడిఓ డి.శ్రీలలిత, పలువురు పీ4 సిబ్బంది పాల్గొన్నారు.

# అవినీతి చక్రవర్తి అవినీతి సామ్రాట్ ఎవరో ప్రజలకు బాగా తెలుసు

**- వాడపల్లి వెంకటేశ్వర స్వామివారి ఆలయాన్ని సైతం దోచేస్తున్న కూటమి ప్రభుత్వం**

**- జిల్లా వైఎస్ఆర్సిపి అధికార ప్రతినిధి కప్పల శ్రీధర్**



**రావులపాలెం, మేజర్ న్యూస్ :** ఉచిత ఇసుక విధానం అని చెప్పి కొత్తపేట నియోజకవర్గంలో గడిచిన సంవత్సర కాలంలో ఒక్కో లారీకి 7000 రూపాయలు చొప్పున వసూలు చేసిన డబ్బు వాడపాలెం ప్యాలెస్ కు చేరింది నిజం కాదా అని జిల్లా అధికార ప్రతినిధి కప్పల శ్రీధర్ ప్రశ్నించారు. గురువారం రావులపాలెం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే బండారు ఆధ్వర్యంలో జరుగుతున్న అరాచకాలపై ఇసుక మట్టి దోపిడీపై ధ్వజమెత్తారు. వారు మాట్లాడుతూ జగ్గిరెడ్డి మీద ఆరోపణలు నిరూపించే దమ్ము మీకు ఉందా? మీ సవాల్ విసిరారు. ఈ సంవత్సర కాలంలో బండారు సత్యానందరావు చేసిన అవినీతి రోజుకి 40 లక్షల రూపాయలు ఇసుక మీద తినేస్తున్నారు అంటే ఈ సంవత్సరకాలంలో ఎన్ని కోట్లు దోచేసి మీ వాడపాలెం ప్యాలెస్‌లో దాచారో ఆ దేవుడికే తెలియాలి. అంగన్వాడీ పోస్టులకి మూడు లక్షలు ప్రతిదానికి కమిషన్లతో మీరు చేస్తున్నది ఏంటో ప్రజలు గమనిస్తూనే ఉన్నారని ఆయన పేర్కొన్నారు. ఈ సంవత్సరంలోనే మీ పరిపాలన చూసి మీ కార్యకర్తలే ఎంత విసుగు చెందారో మళ్లీ మేము చెప్పనక్కర్లేదు అని ఆయన అన్నారు. మద్యం నియోజకవర్గంలో ఏరులై పారిస్తూ బెల్ట్ షాపులు పెట్టి ప్రతి బాటిల్ పై కమిషన్లు తీసుకుంటున్న మీరు కూడా మా గురించి మాట్లాడుతుంటే మాకు నవ్వొస్తుందని ఆయన ఏద్దేవా చేశారు. కోవిడ్ సమయంలో తన ప్రాణాలు సైతం లెక్కచేయకుండా ప్రజల కోసం నిత్యం సేవలందించిన మా నాయకుడు జగ్గిరెడ్డికి, మనకెందుకు అనుకుని హైదరాబాదులో దాక్కున్న మీ బండారుకి పోలికా, బెల్ట్ షాపులు పెట్టి రేట్లు పెంచి సామాన్యుల రక్తం మీరు తాగడం లేదా అని ప్రశ్నిస్తున్నాం అని, వాడపల్లి ఈవో దగ్గర కమిషన్, ఎవరికైనా పోస్టింగులు వేస్తే కమిషన్, అంగన్వాడీలకు కమిషన్, నియోజకవర్గంలో ప్రతి పనికి ఒక రేటు పెట్టి కమిషన్ దండుకుంటున్నది బండారు సత్యానందరావు కాదా అని ఆయన ప్రశ్నించారు. ఇసుక, అధికారులు బదిలీలకు కమిషన్లు, మట్టి, చికెన్ షాపులలో కరెంట్ మీటర్లకు కమిషన్లు, వాడపల్లి గుడిలో అవినీతి ఇలా ఈ సంవత్సర కాలంలోనే ఎంత అవినీతి చేశారో నియోజకవర్గ ప్రజలు అందరూ గమనిస్తున్నారన్నారు. ఇప్పటికే ప్రజలు వేచి చూస్తున్నారు మళ్లీ ఎన్నికలు ఎప్పుడు వస్తాయా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని ఎప్పుడు గెలిపించుకుందాం అంటూ వెయ్యి కళ్ళతో ఎదురుచూస్తున్నారని తెలిపారు.మీ కేసులకు మీ రెడ్ బుక్ రాజ్యాంగాలకు భయపడే ప్రసక్తే లేదన్నారు. ఇలాంటి అవినీతి నాయకుడి గురించి ప్రజలకు ఎప్పటికప్పుడు తెలియజేయవలసిన బాధ్యత ప్రతి ఒక్క వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు కార్యకర్తల మీద ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రావులపాలెం మండల వైయస్సార్ సిపి అధ్యక్షులు బొక్క కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

# వనమాడి కొండబాబును మర్యాదపూర్వకంగా కలిసిన సీరత్ కమిటీ నూతన కార్యవర్గం



**కాకినాడ, మేజర్ న్యూస్ :** నూతనంగా ఎన్నుకోబడిన శ్రీరత్ కమిటీ కార్యవర్గం గురువారం కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబుని ఆయన స్వగృహం నందు మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ స్టేట్ వక్ఫ్ బోర్డు నుండి కాకినాడ సిటీ నియోజకవర్గ సీరత్ కమిటీ అధ్యక్షులుగా ఎస్.కె.రహీమ్, ఉపాధ్యక్షులుగా షేక్ ముర్తుజ, మహమ్మద్ గౌస్ మొహిద్దిన్, ప్రధాన కార్యదర్శిగా షేక్ అష్రఫ్ అలీ, జాయింట్ సెక్రెటరీగా ఎం.వై. బక్ త్తర్, ఎం.ఎ.గాలిబ్, డైరెక్టర్లుగా షేక్ ఖాసిం సాహెబ్, మహమ్మద్ అబ్దుల్ రహీం, షేక్ అన్వర్, షేక్ అహ్మద్ బాషా లను నియమించడం జరిగిందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మైనారిటీ జిల్లా అధ్యక్షులు ఎం.డి. ఖాన్, ఎం.డి. ఆన్సర్, సయ్యద్ అలీ, ఖాదర్ ఖాన్, అర్బన్ భాష, జారుఖాన్, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

# మహాలయ పక్ష ప్రత్యేక సప్త మోక్ష క్షేత్ర యాత్ర రైలు



**- యాత్ర సెప్టెంబర్ 9వ తేదీ నుండి ప్రారంభం**

**కాకినాడ, మేజర్ న్యూస్ :** పవిత్ర క్షేత్ర దర్శనాలే లక్ష్యంగా ఆధ్యాత్మిక యాత్రకు శ్రీకారం చుట్టామని ఇండియన్ రైల్వేస్ సౌత్ స్టార్ రైల్ & టూర్ టైమ్స్ డైరెక్టర్ విఘ్నేష్ జీ తెలిపారు. ఈ మేరకు కాకినాడ ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాలయ పక్ష ప్రత్యేక సప్త మోక్ష క్షేత్ర యాత్ర సెప్టెంబర్ 9వ తేదీన ప్రారంభం అవుతుందన్నారు. గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, గుంటూరు, మిర్యాలగూడ, నల్గొండ, హైదరాబాద్, కాజీపేట స్టేషన్లలో యాత్రికులు రైలు ఎక్కి వీలుందన్నారు. ఈ యాత్ర పదిహేను రోజులు జరగనుందన్నారు. ఇండియన్ రైల్వేస్, భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు, సౌత్ స్టార్ రైలు, భారత ప్రభుత్వ పర్యాటక మంత్రిత్వ శాఖ గుర్తింపు పొందిన అగ్రశ్రేణి టూరిస్ట్ రైలు ఆపరేటర్ 'టూర్ టైమ్స్' ఈ యాత్రకు నడుం బిగించిందన్నారు. ఈ యాత్రలో ఉజ్జయిని, ఓంకారేశ్వర్, ద్వారకా, సిద్ధ పూర్, మధుర, అయోధ్య, ప్రయాగ్ రాజ్, వారణాసి, గయ వంటి పవిత్ర పుణ్యక్షేత్రాలను కవర్ చేయనున్నామని చెప్పారు. గతంలో ఇండియన్ రైల్వేస్ టూర్ టైమ్స్ ప్యాకేజీకు విశేష స్పందన లభించిందన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల నుంచి 650 మంది యాత్రికులతో విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. ఈ సందర్భంగా టూర్ టైమ్స్ జనరల్ మేనేజర్ సంతోష్ మాట్లాడుతూ ప్రాచీన గ్రంథాలు, పురాణాల ప్రకారం ఈ యాత్రలో ఉన్న క్షేత్రాలు ఎంతో పేరుగాంచాయన్నారు. ఇవి మానవ శరీరంలోని వివిధ శక్తి కేంద్రాలను సూచిస్తాయని చెప్పారు. అవి.. అయోధ్య (మనస్సు), మధుర (హృదయం), కాశీ (సహస్రార చక్రం), ఉజ్జయిని (నాభి), ద్వారకా (పాదాలు), గయ (పితృ మోక్ష స్థలం), మాతృ గయ (మాతృ మోక్ష స్థలం) అన్నారు. ఈ ప్రత్యేక టూరిస్ట్ రైలు యాత్రికులకు పలు అనుభవాలు అందించడానికి సిద్ధంగా ఉందన్నారు. ఈ రైలులో లోపల, బయట దక్షిణ భారత భోజనం అందుబాటులో ఉంటుందన్నారు. లగేజ్ భారం ఉండదన్నారు. దర్శనానికి అవసరమైన బ్యాగ్ మాత్రమే మోయాల్సి ఉంటుందని చెప్పారు. ఈ ప్యాకేజీపై ఇండియన్ రైల్వే 33 శాతం సబ్సిడీ ఇస్తుందన్నారు. థర్డ్ ఏసీ (కంఫర్ట్) రూ.45,750, సెకండ్ ఏసీ (డీలక్స్) రూ.54,100, ఫస్ట్ ఏసీ (లగ్జరీ) రూ.69,500 అన్నారు. ఈ యాత్ర టికెట్లను ఫోన్ 93550 21516 కాల్ చేసి బుక్ చేసుకోవచ్చన్నారు. ఆన్లైన్ బుకింగ్ కోసం టూర్ టైమ్స్.ఇన్ సందర్శించవచ్చన్నారు. ఈ సమావేశంలో టూర్ టైమ్స్ మేనేజర్ యాకేశ్ పాల్గొన్నారు.

# శ్రీ సత్య దేవుని నిత్య అన్నదాన పథకానికి రూ.1,00,000లు విరాళం



**అన్నవరం,మేజర్‌న్యూస్ :** కాకినాడ జిల్లా అన్నవరం ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానంఆధ్వర్యంలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి తణుకు వాస్తవ్యులు మానేపల్లి సాయిబాబా, లక్ష్మీదేవి రూ.1,00,000లు విరాళం దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావుకి అందజేశారు. దీనిపై వచ్చే వడ్డీతో జులై 31వ తేదీన అన్నదానం జరిపించాలని దాత కోరారు. దేవస్థానం అధికారులు దాతను అభినందించారు.

# రావులపాలెంకు 205 కొత్త పెన్షన్లు మంజూరు



**రావులపాలెం, మేజర్ న్యూస్ :** రావులపాలెం మండలంలో కొత్తగా 205 పెన్షన్లు మంజూరయ్యాని వాటిని శుక్రవారం నుంచి సంబంధిత సచివాలయ ఉద్యోగులు ఇంటింటికి వెళ్లి పంపిణీ చేస్తారని ఎంపీడీవో మహేశ్వర రావు తెలిపారు. ఈ పింఛన్లన్నీ భర్త పింఛను తీసుకుంటూ మరణిస్తే భార్యకు మంజూరైనవిగా వివరించారు. మొత్తం 205 పించన్లకుగాను రూ.8.26 లక్షలు విడుదల అయ్యాయన్నారు. వీటిలో రావులపాలెం-2 సచివాలయం పరిధిలో ఒకరికి కిడ్నీ పెన్షన్ గా రూ.15 వేలు మంజూరయ్యాయని మిగిలినవన్నీ నాలుగువేల రూపాయలు చొప్పున పంపిణీ చేస్తున్నట్లు ఆయన వివరించారు. గ్రామాలవారీగా మంజూరైన పించన్ల వివరాలు : దేవరపల్లి-26, ఈతకోట-16, గోపాలపురం -22, కేతరాజుపల్లి-1, కొమరాజుల ంక-14, లక్ష్మీ పోలవరం-10, ముమ్మిడివర్రాడు-5, పొడగట్లపల్లి-22, రావులపాడు -12, రావులపాలెం-42 ఊబలంక-24, వెదిరేశ్వరం- 11 మంజూరయ్యాయి.

## ఆత్మీయ యుఎస్ఏ ఆర్గనైజేషన్ సహకారం మరువలేను

**- పద్మశ్రీ సంకురాత్రి చంద్రశేఖర్**

**- కిరణ్ కంటి ఆసుపత్రిని సందర్శించిన ఆత్మీయ ఫౌండేషన్**

**- సంకురాత్రి ఫౌండేషన్‌కు రెండు లక్షల విరాళం అందజేసిన ఆత్మీయ ఫౌండేషన్**



**కాకినాడ రూరల్, మేజర్ న్యూస్ :** యూఎస్ఏకి చెందిన ప్రవాస భారతీయులు ఆత్మీయ యుఎస్ఏ ఆర్గనైజేషన్ ద్వారా మా సంస్థ సంకురాత్రి ఫౌండేషన్‌కు మహిళా విద్యార్థుల చదువుకై చెక్కు అందజేసిన వారి సహాయాన్ని మరువలేను అని కిరణ్ కంటి ఆసుపత్రి సంకురాత్రి ఫౌండేషన్ అధినేత పద్మశ్రీ సంకురాత్రి చంద్రశేఖర్ అన్నారు.

స్థానిక కాకినాడ రూరల్ మండలం పెనుమర్తి గ్రామంలో ఉన్న కిరణ్ కంటి ఆసుపత్రి ఆవరణలో యుఎస్ఏకి చెందిన ఆత్మీయ ఆర్గనైజేషన్ అక్కడ ఉన్న మహిళా విద్యార్థుల శారద విద్యానికేతన్ని సందర్శించి పిల్లల బంగారు భవిష్యత్తుకు రోబోటిక్ క్లాసులపై వారికి అవగాహన కల్పించి, అనంతరం పిల్లలు రోబోటిక్‌లో రాణించాలని ఆత్మీయ యుఎస్ఏ ఆర్గనైజేషన్ ద్వారా రెండు లక్షల రూపాయలు చెక్, అదనంగా రెండు వేల డాలర్లు కిరణ్ కంటి ఆసుపత్రి అధినేత సంకురాత్రి చంద్రశేఖర్‌కి అందజేశారు.

# రావులపాలెంకు కలసి వచ్చిన వాడపల్లి పుణ్యక్షేత్రం



**– శుక్ర, శని, ఆదివారాల్లో పండగే పండగ**

**– దూసుకుపోతున్న హెూటల్స్ రంగం**

**– చిరు వ్యాపారులు, ఆటో కార్మికులకు ఉపాధి**

**రావులపాలెం, మేజర్ న్యూస్ :** కోనసీమ తిరుమలగా ప్రసిద్ధికెక్కి దినదినాభివృద్ధి చెందుతున్న ఆత్రేయపురం మండలం వాడపల్లి వెంకటేశ్వర స్వామి పుణ్యక్షేత్రం రావులపాలెంకు వరంగా మారింది. రావులపాలెం కేంద్రంగా వాడపల్లికి వెళ్లే వచ్చే భక్తులు వేలాదిగా ఉంటున్నారు. దీంతో రావులపాలెం కూడా అన్ని రంగాల్లో విశేష అభివృద్ధి చెందుతుంది. అందులో ముఖ్యంగా హెూటల్స్ రంగాన్ని పేర్కొనవచ్చు. వాడపల్లి ఆలయంకు సంబంధించి కాటేజీ సౌకర్యం లేదు. అందువల్ల రావులపాలెంలోనే భక్తులు బస చేస్తున్నారు. ఇందుకోసం ఎన్నో అధునాతన హెూటల్స్ రోజురోజుకీ రావులపాలెంలో వెలుస్తున్నాయి. కోనసీమ ముఖ ద్వారంగా, నాలుగు లైన్ల జాతీయ రహదారితో కళకళలాడుతూ ఉండే రావులపాలెంకు వాడపల్లి పుణ్యక్షేత్రంతో మరింత అభివృద్ధి వైపు అడుగులు వేస్తుంది. శనివారం వచ్చిందంటే రావులపాలెం కిటకిటలాడిపోతుంది. రాష్ట్ర నలుమూల నుంచి వచ్చే బస్సులు రావులపాలెం మీదుగా వాడపల్లి వెళ్తుంటాయి. రాష్ట్రవ్యాప్తంగా 30 ఆర్టీసీ డిపోల నుంచి వాడపల్లికి బస్సులు తిరుగుతున్నాయి. ఈ బస్సులు రాజమండ్రి వైపు నుంచి ధవలేశ్వరం, బొబ్బర్లంక మీదిగా వచ్చే అవకాశం ఉంది.కాని అక్కడ అన్ని బస్సులు వచ్చే సామర్థ్యం గల రహదారి సౌకర్యం లేనందున నాలుగు లైన్లు రహదారి మీదుగా రావులపాలెం వచ్చి అక్కడ నుంచి సులువుగా వాడపల్లి చేరుకుంటున్నారు. ఇక ఆర్థిక స్తోమత కలిగిన భక్తులు ముందుగానే రావులపాలెం చేరుకుని రాత్రికి అక్కడ హెూటల్స్‌లో బస చేసి మర్నాడు ఉదయాన్నే స్వామివారి దర్శనానికి వెళుతున్నారు. అందువల్లనే రావులపాలెంలో హెూటల్స్ ఎన్ని వెలసినప్పటికీ ఎక్కడా గదులు ఖాళీ ఉండటం లేదు.

పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రంగా పేరొందిన కోనసీమ ప్రాంతంలో రావులపాలానికి ప్రత్యేక స్థానం ఉంది. రావులపాలెం నుంచి వాడపల్లి ఏడు కిలోమీటర్ల దూరంలో ఉంది. అలాగే ర్యాలీ శ్రీ జగన్మోహిని కేశవస్వామి ఆలయం కేవలం ఆరు కిలోమీటర్ల దూరంలో ఉంది. శని దోషాలను తొలగించే మందపల్లి శ్రీ పార్వతి మందేశ్వర (శనేశ్వర)స్వామి వారి ఆలయం కూడా ఆరు కిలోమీటర్ల దూరంలోనే ఉంది. ఇక భక్తుల కోరిన కోర్కెలు తీర్చే అయినవిల్లి శ్రీ సిద్ది వినాయక దేవాలయం రావులపాలెంకు 25 కిలోమీటర్ల దూరంలో ఉంది. దక్షిణ కాశీగా కీర్తికెక్కిన దాక్షారామం శ్రీ మాణిక్యాంబ సమేత శ్రీ భీమేశ్వర స్వామివారి ఆలయం 40 కిలోమీటర్ల దూరంలో ఉంది. అలాగే కోనసీమ జిల్లాలో ప్రసిద్ధి చెందిన మరో ప్రముఖ క్షేత్రం అంతర్వేది శ్రీ లక్ష్మి నరసింహ స్వామివారి దేవాలయం రావులపాలెం కు 65 కిలోమీటర్ల దూరంలో ఉంది. అందువల్ల భక్తులు రావులపాలెంకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇక్కడ నుంచే అన్ని దేవాలయాలు దర్శించుకోవడానికి మొగ్గు చూపుతున్నారు.

వాడపల్లి పుణ్యక్షేత్రం ప్రసిద్ధి చెందడంతో రావులపాలెం ఆర్టీసీ డిపోకి అధిక మొత్తంలో ఆదాయం సమకూరుతుంది. రావులపాలెం నుంచి రెగ్యులర్‌గా ఆర్టీసీ బస్సులు వాడపల్లికి అందుబాటులో ఉన్నాయి. ప్రతి శనివారం పన్నెండు బస్సులు 111 ట్రిప్పులు రావులపాలెం నుండి తిరుగుచున్నాయి. మిగిలిన రోజుల్లో కూడా రెండు బస్సులు ఏడు కిలోమీటర్లు సెటిల్ సర్వీసు చేస్తున్నాయి. భక్తుల రద్దీని బట్టి ఈ బస్సులు పెంచుతూ వస్తున్నారు. అలాగే కోనసీమ జిల్లా పరిధిలోని అమలాపురం ఆర్టీసీ డిపో నుంచి అయిదు బస్సులు, రాజోలు డిపో నుంచి ఐదు బస్సులు, రామచంద్రపురం డిపో నుంచి నాలుగు బస్సులు వాడపల్లి భక్తుల కోసం తిరుగుతున్నాయి. దీంతో ఆయా ఆర్టీసీ డిపోలకు ఆదాయం సమకూర్తుంది. వాడపల్లికి వచ్చే భక్తులతో రావులపాలెంకు చెందిన ఆటో కార్మికులు, చిరు వ్యాపారులు ఎంతో ఉపాధి పొందుతున్నారు. ఒక పుణ్యక్షేత్రం అభివృద్ధి చెందితే దాని ప్రభావం మిగిలిన ప్రాతాలకు ఎలా ఉంటుంది అనడానికి ఇదో ఉదాహరణగా పేర్కోవచ్చు.

# ఎన్‌సిసి ఉత్తమ క్రమశిక్షణను అలవరుస్తుంది



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** ఎన్‌సిసి విద్యార్థులలో ఉత్తమ క్రమశిక్షణను అలవరుస్తుందని, జీవితంలో ఎదురయ్యే కష్టాల నుండి ఎదుర్కొని, ఉత్తమ జీవితానికి బాటలు వేస్తుందని, ఐడిఎస్ఎస్‌సి మరియు ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల ఎన్‌సిసి అధికారి డిప్యూటి డైరెక్టర్ జనరల్ ఎయిర్ కమాండర్ నర్సింగ్ శైలాని తెలిపారు. పెద్దాపురం శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాలలో జూలై 25 నుండి ఆగష్టు 3 వరకు పదిరోజుల పాటు జరగుతున్న ఐడిఎస్ఎస్‌సి కార్యక్రమాన్ని డిప్యూటి డైరెక్టర్ జనరల్ ఎయిర్ కమాండర్ నర్సింగ్ శైలాని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులంతా అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్నారని ఇలాంటి ఆహ్లాదకర వాతావరణంలో క్యాంప్ జరగడం చాలా సంతోషంగా ఉందని, శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాల వారు ఏర్పాటు చేసిన వసతులు అన్ని బాగున్నాయని ప్రశంసిస్తూ శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాల డైరెక్టర్ సిహెచ్.విజయ్‌ప్రకాష్‌ను అభినందించారు. అనంతరం ఆంధ్రా, తెలంగాణాకు సంబంధించిన ఐడిఎస్ఎస్‌సి టీమ్ టీషర్ట్‌లను ఆవిష్కరించి, క్యాంప్‌లో జరిగిన షూటింగ్‌లలో ఎంపికైన విద్యార్థులకు రైఫింగ్ షూటింగ్ కిట్స్ అందజేశారు. అనంతరం శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాల డైరెక్టర్ సిహెచ్.విజయ్‌ప్రకాష్ డిప్యూటి డైరెక్టర్ జనరల్ ఎయిర్ కమాండర్ నర్సింగ్ శైలాని ని సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ గ్రూప్ కమాండర్ కల్నల్ రితీష్ మోహన్ అగర్వాల్, కల్నల్ హెచ్.ఎస్.మౌనిక, మేజర్ మహ్మద్ అసిఫ్ మరియు ఎన్‌సిసి క్యాడెట్లు పాల్గొన్నారు.

# కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం



**– జీరో ఇన్సిడెంట్ లక్ష్యంగా ప్రణాళికలు**

**– కార్మిక శాఖ మంత్రి సుభాష్**

**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** సి ఎస్ ఆర్ కింద అందచేసిన రూ.42 లక్షల విలువ గల అత్యాధునిక అంబులెన్స్ ను మంత్రి వాసంశెట్టి ప్రారంభించారు. కార్మికుల ఆరోగ్యం, సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, ఇందుకోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని రాష్ట్ర కార్మిక, కర్మగార, బాయిలర్స్ మరియు వైద్య భీమ సేవల శాఖామాత్యులు వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. గురువారం రాజమహేంద్రవరం శ్రీరామనగర్‌లోని ఈఎస్ఐ ఆసుపత్రిలో కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద యూనియన్ బ్యాంక్ విరాళంగా అందజేసిన రూ.42 లక్షల విలువైన అత్యాధునిక సౌకర్యాలు (వెంటిలేటర్, మానిటర్, ఇన్‌ఫ్యూజన్, (స్ట్రెచర్, ఏసీ) కలిగిన అంబులెన్స్‌ను మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ, జీరో ఇన్సిడెంట్ నమోదే ప్రభుత్వ లక్ష్యమని, ఫ్యాక్టరీలు, కర్మాగారాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నాణ్యత ప్రమాణాలు పాటించని ఫ్యాక్టరీలకు అనుమతులు మంజూరు చేయబోమని, ప్రమాణాల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడబోమని హెచ్చరించారు. రాజమహేంద్రవరం ఈఎస్ఐ ఆసుపత్రిలో రోజూ 200–300 మంది పేషెంట్లు వైద్య సేవలు పొందు తున్నారని, కార్మికుల భీమా చెల్లింపులో యాజమాన్యాల నిర్లక్ష్యం ఉంటే శాఖా పరంగా కఠిన చర్యలు తీసుకుంటా మని అన్నారు. త్వరలో 150 పడకల సామర్థ్యం గల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని అమరావతిలో నిర్మించనున్నట్లు తెలిపారు. యూనియన్ బ్యాంక్ అందించిన అంబులెన్స్‌కి మంత్రి హృదయ పూర్వకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ అంబులెన్స్‌కు 3 సంవత్సరాల పాటు నిర్వహణ సేవలు, డ్రైవర్, టెక్నీషియన్, స్పెషలిస్ట్ డాక్టర్ లాంటి సదుపాయాలు అందించడం జరిగిందని పేర్కొన్నారు. ఈఈఎస్ఐ బెనిఫిషరీ కార్డు కలిగిన కార్మికులకు ఉచిత వైద్య సేవలతోపాటు, దీర్ఘకాలిక అనారోగ్యం పట్ల ఆరు నెలల పాటు జీవనోపాధి భృతి (సగం జీతం) రూపంలో ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్నట్లు మంత్రి వివరించారు. కార్యక్రమంలో ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ వి. ఆంజనేయులు, యూనియన్ బ్యాంక్ రీజనల్ మేనేజర్ ఏ. విశ్వేశ్వరరావు, ఈఎస్ఐ వైద్యులు, నర్సులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డా॥ ఉమర్ ఆలీషాచే సుందరీకరణ ప్రారంభోత్సవ వేడుకలు




**కాకినాడ, మేజర్ న్యూస్ :** పరబ్రహ్మ స్వరుపం అని పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా భాషణ చేశారు. గురువారం ఉదయం స్థానిక శ్రీ విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం పూర్వ ఆశ్రమం సుందరీకరణ ప్రారంభోత్సవ కార్యక్రమానికి పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా అధ్యక్షత వహించగా వారి సోదరులు మహబూబ్ బాషా, అహమ్మద్ ఆలీషా, కబీర్ షా అతిథులుగా పాల్గొన్నారు. పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు సెంట్రల్ కమిటీ సభ్యులు పేరూరి కోమలి, ఏ.వి.వి.సత్యనారాయణ, పీఠం చీఫ్ ఇంజనీర్ ఎం.ఆర్.కె.రాజు పాల్గొన్నారు.

పూర్వ ఆశ్రమంలో గులాబీతోటను, అష్టమ పీఠాధిపతి పరబ్రహ్మ మొహిదీన్ భాష అవతారం చాలించిన రోజు పుణ్య కాలంలో వారు వేలాదిమందికి ఉపన్యాసములు చెప్పిన వేదిక అనే కుటీరమును, నెమలి వనమును మరియు నూతన ఆశ్రమంలో పంచమ పీఠాధిపతి మోహియుద్దీన్ భాష కుటీరంను, పేరూరి మినీ భోజనశాలను పీఠాధిపతి డాక్టర్ ఉమర్ అలీషా ఘనంగా ప్రారంభించారు.

నూతన ఆశ్రమ సుందరీకరణకు సహకారం అందించిన 27 కుటుంబాల కుటుంబ సభ్యులకు డాక్టర్ ఉమర్ అలీషా ప్రత్యేక ప్రసాదం అందచేశారు. ఆశ్రమ సుందరీకరణలో భాగంగా గులాబీ మొక్కలతో పాటు ఆక్సిజన్ ఎక్కువగా అందించే వివిధ రకాల మొక్కలను కూడా నూతన ఆశ్రమం మరియు పూర్వ ఆశ్రమంలో కూడా పెంచి, రెండు ఆశ్రమాలను వివిధ వనములతో ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పాటు చేశారు. పీఠాధిపతి డాక్టర్ ఉమర్ అలీషా మాట్లాడుతూ కోట్లాది రూపాయలు వెచ్చించినా పొందలేని మనశ్శాంతి, ఆరోగ్యం, సంతోషం, తృప్తిని ఆశ్రమం సందర్శించిన సభ్యులు పొందగలుగుచున్నారన్నారు. ప్రతీ గురువారం సాయంత్రం నాలుగున్నర గంటల నుండి 6.30 వరకు పీఠాధిపతి డాక్టర్ ఉమర్ అలీషా అధ్యక్షతన జ్ఞాన చైతన్య సదస్సులు నిర్వహిస్తామన్నారు.

# జీ తెలుగు ఆధ్వర్యంలో జీ రైటర్స్ రూమ్ సెలక్షన్స్.. ఈ ఆదివారం మన విశాఖపట్నంలో!

**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఆసక్తికరమైన, ఆలోచనలు రేకెత్తించే కథలతో బుల్లితెర ప్రేక్షకులను అలరిస్తున్న జీ తెలుగు ఔత్సాహిక రచయితలకు గొప్ప అవకాశాన్ని అందిస్తోంది. జీ రైటర్స్ రూమ్ కేవలం ప్రతిభను వెలికితీసే ప్రయత్నం మాత్రమే కాదుఇది 'యువర్స్ ట్రూలీ జీ' అనే కంపెనీ బ్రాండ్‌తో ప్రారంభమైన ఒక సృజనాత్మక ఉద్యమం. ఈ కార్యక్రమం జీ యొక్క అన్ని ప్లాట్‌ఫామ్‌లలో కథలను మరింత సమర్థవంతంగా మార్చడమే లక్ష్యంగా మొదలైంది. సరికొత్త దృక్పథాల కోసం పెరిగిన డిమాండ్ నేపథ్యంలో, సృజనాత్మకత కలిగిన రచయితలను గుర్తించడంతోపాటు సృజనా సామర్థ్యం, రచయితల వృత్తిగత ప్రపంచం మధ్య అంతరాన్ని తగ్గించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. ఎంపికైన రచయితలకు విస్తృతమైన '%%' సంస్థలోని టీవీ, డిజిటల్, సినిమా ప్లాట్‌ఫామ్‌ల కోసం సమర్థవంతమైన, ఆకర్షణీయమైన కథలను రూపొందించే అవకాశం లభిస్తుంది. దేశవ్యాప్తంగా జరుగుతున్న జీ రైటర్స్ రూమ్ కార్యక్రమంలో భాగంగా జీ తెలుగు ఆగస్టు 3న విశాఖపట్నం వేదికగా రచయితలను ఎంపిక చేయనుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని తెలుగు రచయితలను ప్రోత్సహించడమే లక్ష్యంగా జీ తెలుగు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. జీ తెలుగులో రాబోయే సీరియల్స్కి బలమైన కథలను రాసే రచయితలతోపాటు సినిమా కథకులను సైతం ఎంపిక చేయనుంది. ఈ కార్యక్రమంలో పాల్గొనేవారు రాత పరీక్షల్లో పాల్గొనాల్సి ఉంటుంది. ఈ పరీక్షల్లో ఎంపికైన అభ్యర్థులు రైటర్స్ రూమ్లో చేరే అవకాశం లభిస్తుంది. ఈ జాబితాలో ఎంపికైన రచయితలకు పరిశ్రమ నిపుణులు రచనాశైలిలో




మెలకువలు నేర్పిస్తారు. జీ నుంచి రాబోయే ప్రాజెక్టులలో ఈ రచయితలు భాగమయ్యే అవకాశం ఉంటుంది. ఈ కార్యక్రమం గురించి జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్, జీ తెలుగు, తమిళం & జీ5 తెలుగు చీఫ్ కంటెంట్ ఆఫీసర్ అనురాధ గూడురు మాట్లాడుతూ.. 'జీ రైటర్స్ రూమ్ ఔత్సాహిక రచయితలు వారిలోని సృజనాత్మకతను వెలికితీసే ఒక అద్భుతమైన అవకాశం. ఈ కార్యక్రమం ద్వారా ఎంపికైన రచయితలు మా సంస్థలోని విభిన్న వేదికలపై రూపొందే సీరియల్స్, సినిమాలు, వెబ్‌సిరీస్లకు కథలను అందిస్తారు. దేశవ్యాప్తంగా ఉన్న రచయితలు తమలోని ప్రతిభకు సానపెట్టి సరికొత్త కథలతో భవిష్యత్తుకు బాటలు వేసుకునే చక్కని అవకాశం. విశాఖపట్నంలో ఈ ఆదివారం జరగనున్న సెలక్షన్స్ను తెలుగు రచయితలు సద్వినియోగపరుచుకోవాలి.' అన్నారు.విశాఖపట్నంలో జీ రైటర్స్ రూమ్ ఆడిషన్స్ వివరాలు :వేదిక: యూనిటీ డిగ్రీ కాలేజీ, 32-1-53, బౌదరా రోడ్, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్ – 530004. ఫోన్ నెం: 9246298135, తేదీ: ఆగస్టు 3, 2025, సమయం: ఉదయం 9:00 గంటల నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకు. తెలుగు కథల్లోని సాంస్కృతిక వైవిధ్యాన్ని, భావోద్వే గాలను ప్రతిబింబించే కథకులను ప్రోత్సహించి వారిని శక్తివంతమైన రచయితలుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా జీ తెలుగు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. సినిమా రచయితగా మారాలని కలలు కనే ఉత్సాహ వంతులకు జీ తెలుగు అందిస్తున్న అద్భుత అవకాశం.. మీ కథలతో సిద్ధంగా ఉండండి, సినీ రచయితగా మారే అవకాశం అందుకోండి!

# పాఠశాలకు భోజనం ప్లేట్లు, కుర్చీలు బహుకరణ




**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఉయ్ సర్వ్ నినాదంతో ప్రపంచవ్యాప్తంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో లయన్స్ క్లబ్ ముందు ఉంటుందని లయన్స్ క్లబ్ జోన్ చైర్పర్సన్ సాలగ్రామ లక్ష్మీ ప్రసన్న తెలిపారు. కాకినాడ స్థానిక దుమ్మలపేట మున్సిపల్ స్కూల్లో గురువారం జరిగిన సేవా కార్యక్రమంలో విద్యార్థులకు 300 భోజనం ప్లేట్లను, పాఠశాల సిబ్బందికి ఎనిమిది కుర్చీలను అందజేశారు. డాక్టర్ ఎన్ఎస్ఆర్ శాస్త్రి జ్ఞాపకార్థం వారి కుమారుడు డాక్టర్ ఎన్ఎస్ మూర్తి సహకారంతో విద్యార్థులు భోజనం చేయడానికి ప్లేట్లనందించామని తెలిపారు. లయన్స్ క్లబ్ శ్రేయస్ అధ్యక్షులు సుశీల, ట్రెజరర్ మణి గౌతమ్, క్లబ్ సర్వీస్ చైర్మన్ సూర్యనారాయణ మూర్తి, జాయింట్ సెక్రెటరీ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా రీజియన్ చైర్మన్ ప్రభుదాస్, మార్కెటింగ్ చైర్మన్ పున్నమరాజు రాజి, గవర్నర్ రిప్రెంటేటివ్ సాలగ్రామ వెంకట సర్వేశ్వరరావు పాల్గొన్నారు. సహకరించిన దాతలకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధర్మరాజు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రజల ఆశలను నేరవేరుస్తున్న "చంద్రబాబు" ప్రభుత్వం



**– 459 కొత్త స్పౌజ్ పెన్షన్లు మంజూరు**

**– కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే "పిల్లి"**

**కాకినాడ రూరల్, మేజర్ న్యూస్ :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో ముందుండి ప్రజల జీవితాల్లో మార్పులు తీసుకొస్తోందని, కాకినాడ రూరల్ నియోజకవర్గంలో 459 నూతన స్పౌజ్ పెన్షన్లు మంజూరు అయ్యాయని కో ఆర్డినేటర్ మాజీ ఎమ్మెల్యే "పిల్లి" దంపతులు తెలిపారు. నియోజకవర్గంలో పలు గ్రామాల్లో పర్యటించిన కోఆర్డినేటర్ పిల్లి సత్యనారాయణ మూర్తి, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంత లక్ష్మి దంపతులు ఆయా గ్రామాల నాయకులకు పెన్షన్ మంజూరు అయిన లబ్ధిదారుల వివరాలను అందించి ఆగస్ట్ 1న పింఛన్ పంపిణీలో పాల్గొనాలని సన్నద్ధం చేశారు. ఈ సందర్భంగా "పిల్లి" దంపతులు మాట్లాడుతూ...ముందస్తుగా వివిధ రకాల పెన్షన్‌కు సంబంధించి తమ కార్యకర్తల ద్వారా అర్హులైనవారి నుండి నియోజకవర్గంలో ప్రతీ గ్రామం నుండి దరఖాస్తులు స్వీకరించడం జరిగిందన్నారు. వాటన్నిటిని గ్రామంలో ముఖ్య నాయకులు ద్వారా ఆయా గ్రామాల సచివాలయాల్లో దరఖాస్తు చేయించడం జరిగిందన్నారు.

అందులో భాగంగా నియోజక వర్గంలో కరప మండలంలో 184, రూరల్‌లో 275 మందికి ఎన్టీఆర్ భరోసా స్పౌజ్ పెన్షన్లు మంజూరు అయ్యాయన్నారు. స్పౌజ్ పెన్షన్లు నిమిత్తం ఒక్కో లబ్ధిదారుకి రూ.4000లు చొప్పున నియోజకవర్గంలో రూ.18,36,000లు ప్రభుత్వం పెన్షన్ మంజూరు చేస్తుందన్నారు. వీటిని ఆగస్టు 1న లబ్ధిదారులకు అందించనున్నారన్నారు. ప్రభుత్వం ప్రజల పట్ల నిబద్ధతతో ముందుకు సాగుతోందని ఈ స్పౌజ్ పెన్షన్లు అందుబాటులోకి రావడంతో, ఎన్నో వితంతు కుటుంబాలకు గౌరవజనకమైన జీవితం సాధ్యమవుతోందని.. గత పాలనలో పెన్షన్ పొందాల్సిన అనేక మంది వితంతువులు అవిశ్రాంతంగా ప్రభుత్వ కార్యాలయాలు అలసిపోయారని, ఇప్పుడున్న కూటమి ప్రభుత్వం అటువంటి బాధితుల పట్ల సానుభూతితో స్పందించి, వారికి న్యాయం చేయడంలో ముందుండి పనిచేస్తోందని ప్రతి ఒక్క అర్హుడి జీవితంలో భరోసా కలిగించేలా ఈ పింఛన్ లాంటి సంక్షేమ పథకాలు ఎంతో కీలకంగా మారాయన్నారు.

## ఏపీఎస్ఆర్టీసీ అష్టదేవతా దర్శిని ప్రత్యేక బస్సు

**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కాకినాడ డిపో శ్రావణ మాసం సందర్భంగా అష్టదేవతాదర్శిని అనే ఒక యాత్ర స్పెషల్ బస్సు కాకినాడ నుండి ఆగస్టు 03వ తేదీ ఉదయం 05.00 కు బయలుదేరునని డిపో మేనేజర్ మనోహర్ ప్రకటనలో తెలిపారు. ఈ బస్సు నిడదవోలు కోట సత్తెమ్మ తల్లి, తాడేపల్లిగూడెం సర్వమంగళ అమ్మవారు, కొల్లేటికోట పెద్దింటమ్మ తల్లి, భీమవరం మావుళ్ళమ్మ తల్లి, యనమదుర్రు పార్వతి సమేత శక్తీశ్వరస్వామి, నత్త రామేశ్వరం శ్రీ రామేశ్వరస్వామి, త్రిలింగ క్షేత్రం, ఆచంట బాల త్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర స్వామి, పెనుగొండ శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు దర్శనం అయిన తరువాత అదే రోజు రాత్రి 9 గంటలకు కాకినాడ చేరున్నారు. ఈ యాత్ర చేయుటకు ఆసక్తి ఉన్నవారు 7382910869 ఫోన్ నెంబరులో సంప్రదించవచ్చునని తెలిపారు.

# సీనియర్ సిటిజన్స్‌కు ఉచితంగా గుర్తింపు కార్డులు



**కాకినాడ, మేజర్ న్యూస్ :** వృద్ధాప్యం గౌరవంగా సాగాలని 60 ఏళ్లు నిండిన వారికి కూటమి ప్రభుత్వం సీనియర్ సిటిజన్స్‌గా గుర్తిస్తూ గుర్తింపు కార్డులు ఉచితంగా అందజేస్తున్నందున సంబంధిత వార్డు లేదా గ్రామ సచివాలయాలలో సంప్రదించాలని సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షులు బుద్ధరాజు సత్యనారాయణ రాజు పేర్కొన్నారు. రమణయ్యపేట లో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఆధార్ కార్డు, కార్డుల మీద సంబంధిత వ్యక్తి బ్లడ్ గ్రూపు, అత్యవసర పరిస్థితులలో సంప్రదించవలసిన ఫోన్ నెంబరు, పాస్పోర్ట్ సైజ్ ఫోటో, ఆధార్ కార్డుకు లింక్ అయిన ఫోన్ నంబరు గల ఫోన్‌ను సచివాలయాలకు వెళ్ళేటప్పుడు తీసుకుని వెళ్లాలని అన్నారు. సీనియర్ సిటిజన్స్‌గా ప్రభుత్వ పథకాలు పొందడానికి, ఆర్టీసీ బస్సులలో రాయితీ పొందడానికి తదితర ప్రయోజనాలు కోసం ఈ కార్డును అర్హత గల ప్రతి ఒక్కరు తీసుకోవాలని బుద్ధరాజు తెలిపారు. అడబాల రత్న ప్రసాద్, సత్యనారాయణ చౌదరి పాల్గొన్నారు.

## కాకినాడ రూరల్ ఎంఈవో బాధ్యతలు చేపట్టిన తుమ్మల రంగారావు

**– 29 సంవత్సరాలుగా క్రీడారంగంలో ఎంతో మంది యువతకు స్ఫూర్తి తుమ్మల**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ రూరల్ మండల విద్యాశాఖ అధికారిగా జగ్గంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న తుమ్మల వెంకట సత్య రంగారావు గురువారం ఉదయం కాకినాడ రూరల్ మండల ఎంఈఓగా పూర్తిస్థాయి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా రాజకీయ నాయకులు, మండల స్థాయి అధికారులు, ఉపాధ్యాయులు, పుష్పగుచ్ఛం, సాలువలతో సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ..29 సంవత్సరాలుగా క్రీడారంగంలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా ఎన్నో సేవలు అందించి ఎంతో మంది యువతకు స్ఫూర్తిప్రదాయకంగా నిలిచి, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శిగా ఏడు సంవత్సరాల పాటు సేవలందించారన్నారు. తుమ్మల, సౌమ్యుడుగా తోటి ఉపాధ్యాయులు, ఉన్నత స్థాయి అధికారులు అందరితోను ఆప్యాయంగా పలకరిస్తూ వృత్తిపట్ల అంకితభావంతో పనిచేస్తూ తనకంటూ ప్రత్యేకతను తుమ్మల రంగారావు సంపాదించుకున్నారని, అలాంటి వ్యక్తి మండల విద్యాశాఖ అధికారిగా రావడం పట్ల మండలంలోని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు.

## ప్రేమ పేరుతో వంచించిన కేసులో ముద్దాయికి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష



**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఒక అమ్మాయిని ప్రేమ పేరుతో నమ్మించి, శారీరకంగా ఆమెను అనుభవించి, గర్భవతిని చేసి, ఆమెకు గర్భం పోవటానికి మందులు ఇచ్చి, గర్భం పోయేటట్లు చేసి, ఆ అమ్మాయిని పెండ్లి చేసుకోకుండా మోసగించిన కేసులో ఒక ముద్దాయికి రాజమహేంద్రవరం 8వ అడిషనల్ సెషన్స్ జడ్జి వై.బెన్నయ్య నాయుడు 10 సంవత్సరాలు కఠిన కారాగార శిక్ష మరియు ఏడు వెయ్య రూపాయలు జరిమానా విధించారు.

2018 సం. రం నుండి కాకినాడ గోదారిగుంట రాజ్యలక్ష్మినగర్ కు చెందిన బల్ల నిర్మల్ కుమార్ అదే ప్రాంతానికి చెందిన సూరంపూడి దీప్తి అనే అమ్మాయితో ప్రేమ వ్యవహారం నడిపి, పెళ్లి చేసుకుంటానని నమ్మించి, శారీరకంగా ఆమెను అనుభవించి, గర్భవతిని చేసి, ఆమెకు గర్భం పోవటానికి నిర్మల్ కుమార్ తన తల్లి బల్ల లలిత సహాయంతో మందులు ఇచ్చి, గర్భం పోయేటట్లు చేసి, ఆ అమ్మాయిని పెండ్లి చేసుకోకుండా మోసగించి, ఆ అమ్మాయిపై తప్పుడు ప్రచారం చేస్తున్నట్లు, అంతట సూరంపూడి దీప్తి, ఆమె అక్క మోర్త నీలిమ వారి గ్రామ పెద్దలలో పెట్టగా, ముందు పెండ్లి చేసుకుంటానని పెద్దలలో ఒప్పుకుని, తరువాత ఆ అమ్మాయిని పెండ్లి చేసుకోకుండా మోసగించినారు. ది.10-11-2023 న సూరంపూడి దీప్తి ఇచ్చిన రిపోర్ట్‌పై కాకినాడ టూ టౌన్ పోలీస్ స్టేషన్ నందు క్రైమ్ నెంబర్ 241/2023 అండర్ సెక్షన్ 417, 376, 313 ఆర్/డబ్ల్యు 34 ఐపిసి కేసుగా అప్పటి ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్, బి.నాగేశ్వర నాయక్ నమోదు చేసి దర్యాప్తు అనంతరం ముద్దాయిలను అరెస్టు చేసి చార్జిషీట్‌ను దాఖలు చేసినారు. ఈ కేసులో రాజమహేంద్రవరం 8వ అడిషనల్ సెషన్స్ జడ్జి వై.బెన్నయ్య నాయుడు విచారణ అనంతరం పై కేసులో మొదటి నిందితుడు బల్ల నిర్మల్ కుమార్‌పై నేరం రుజువు అయినందున నిర్మల్ కుమార్‌కి సెక్షన్ 376 ఐపిసి కి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష మరియు 5 వేలు జరిమానా, సెక్షన్ 312 ఐపిసి కి 2 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష మరియు 2 వేలు జరిమానా, మరియు సెక్షన్ 417 ఐపిసి కి 1 సంవత్సరం సాదారణ కారాగార శిక్ష, జరిమానా కట్టని పక్షంలో 6 నెలలు సాధారణ శిక్ష విధించారు. 2వ ముద్దాయి బల్ల లలితపై కేసు రుజువు కానందున ఆమెపై కేసు కొట్టివేసినారు. పై కేసు ప్రాసిక్యూషన్ తరపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.రాధాకృష్ణ రాజు వాదనలు వినిపించారు. కోర్టు హెడ్ కానిస్టేబుల్ కె.వేంకటేశులు సాక్షులను సరైన సమయంలో కోర్టు నందు ప్రవేశపెట్టగా, ప్రస్తుత ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎం.అప్పలనాయుడు ప్రాసిక్యూషన్‌కు ముద్దాయికి శిక్ష పడుటలో సహకరించినారు.

# సొసైటీల ద్వారా రైతులకు చేయూత



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** ప్రభుత్వం ద్వారా రైతులకు మంజూరయ్యే పథకాలన్నిటిని సక్రమంగా అందించేందుకు తన వంతు కృషి చేస్తానని ఉచ్చిలి సహకార సంఘ త్రిసభ్య కమిటీ చైర్మన్ తోటకూర సుబ్బరాజు అన్నారు. ఆయన గురువారం అట్టహాసంగా సభ్యులతో కలిసి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు సకాలంలో రుణాలు ఎరువులు తదితర రాయితీలు అందిస్తూ సహకార సంఘాన్ని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. సొసైటీకి సొంత భవనం నిర్మించేందుకు నిధులు మంజూరు కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానన్నారు. రైతుల పరంగా సమస్యలు ఉంటే నా దృష్టికి తీసుకువస్తే తగిన విధంగా పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కూసం పూడి రామకృష్ణం రాజు, మండల తెలుగు యువత అధ్యక్షులు వెచ్చ అనిల్, ముదునూరి నరేంద్ర, సొసైటీ సెక్రటరీ సురేష్ రాజు తదితరులు ఉన్నారు.

# ఏజెన్సీలో అక్రమ మైనింగ్‌లపై చర్యలు తీసుకోవాలి

**– ఐటీడీఏ పిఒకు ఆదివాసి సంక్షేమ పరిషత్ నాయకులు ఫిర్యాదు**


**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** రంపచోడవరం నియోజకవర్గం పరిధిలోని అక్రమ మైనింగ్ లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, అక్రమ క్వారీ వివరాలతో ఐటీడీఏ పిఒకు ఆదివాసి సంక్షేమ పరిషత్ నాయకులు గురువారం ఫిర్యాదు చేసారు. ఆదివాసి సంక్షేమ పరిషత్ నాయకులు రంపచోడవరం నియోజకవర్గం పరిధిలోని పలు అక్రమ మైనింగ్‌లపై లిఖితపూర్వకంగా రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం కు ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను మాట్లాడుతూ రంపచోడవరం నియోజకవర్గంలో అక్రమ మెటల్ క్వారీలు, గ్రానైట్ తవ్వకాలు, రంగురాళ్ల తవ్వకాలు, గ్రావెల్ తవ్వకాలు కొనసాగుతున్నాయని, వాటన్నిటిపై సమగ్ర విచారణ జరిపి తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన ఐటీడీఏ పిఒ సింహాచలం రంపచోడవరం సబ్ కలెక్టర్ ను విచారణ అధికారిగా నియమించి, విచారణ చేయిస్తామని తెలియజేసినట్లు ఆయన తెలిపారు. అనంతరం కార్యకర్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రంపచోడవరం నియోజకవర్గం పరిధిలోని ఏజెన్సీ ప్రాంతాల్లో మైనింగ్ మాఫియా రెచ్చిపోతుందని, ఇలాగే వదిలేస్తే ఏజెన్సీలో ఉన్నటువంటి ఖనిజ సంపద అంతా నాన్ ట్రైబల్స్ దోచుకుపోతారని ఆవేదన వ్యక్తం చేసారు. ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా కొనసాగుతున్న అక్రమ మైనింగ్ లపై ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు కఠిన చర్యలు తీసుకోవలసిన అవసరం ఉందన్నారు. మైనింగ్ మాఫియా స్థానికంగా ఉన్న కొంతమంది ట్రైబల్స్ ను మచ్చిక చేసుకుని, కొంతమందిని బినామీలుగా పెట్టుకొని ఏజెన్సీ ప్రాంతంలో ఖనిజ సంపదను విచ్చలవిడిగా దోచుకుంటున్నారని, ఆదివాసీ ప్రజలు దీన్ని గమనించాలని ఆయన హితవు పలికారు. ఏజెన్సీ ప్రాంతాల్లో పీసా నిబంధనలు మేరకు సొసైటీల ద్వారా మాత్రమే మైనింగ్ కొనసాగించాలని, కానీ కొంతమంది మైనింగ్



అధికారులు కొంతమంది వ్యక్తులకు తప్పుడు పద్ధతిలో లీజులు ఇస్తున్నారని, ఇది పూర్తిగా చట్ట విరుద్ధమన్నారు. సారా ప్యాకెట్లకు, బిర్యానీ ప్యాకెట్లకు అమ్ముడుపోయి మైనింగ్ మాఫియాకు సపోర్ట్ చేస్తే ఏజెన్సీలో ఆదివాసీలకు, భవిష్యత్ తరాలకు అన్యాయం చేసి జాతి మొత్తం అనుభవించాల్సిన ఏజెన్సీ ప్రాంతంలోని వనరులు నాన్ ట్రైబల్స్ దోచుకుంటున్నారని విమర్శించారు. అటువంటి వారికి తొత్తులుగా కొంతమంది ఆదివాసీలు ఉంటున్నారని, ఇది ఆదివాసి సమాజానికి శ్రేయస్కరం కాదని, ఇప్పటికైనా ఆదివాసుల్లో మార్పు రావాలని, మన ప్రాంత వనరులను మనమే పొందాలని, వాటి ద్వారా వచ్చే ఆర్థిక లబ్ధితో ఆదివాసీ గ్రామాలు అభివృద్ధి చేసుకోవాలని, మైనింగ్ ఉన్న ప్రతి ప్రాంతంలో ఆదివాసులు సొసైటీలు ఏర్పాటు చేసుకొని గ్రామ సొసైటీల ద్వారా ఎవరికీ బినామీ లేకుండా చేసుకుంటే ఏజెన్సీ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని హితవు పలికారు. ఏజెన్సీ ప్రాంతాల్లో అక్రమ మైనింగ్ తవ్వకాలు అరికట్టే వరకు ఆదివాసి సంక్షేమ పరిషత్ ఉద్యమాన్ని కొనసాగిస్తుందని, రాబోయే రోజుల్లో దీనిపై ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షులు పేదల బాబురావు, డివిజన్ అధ్యక్షులు మొడిద నూకరాజు, చోడి ప్రదీప్ దొర, అబ్బాయి దొర, పీత ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు టిడిపి మండల అధ్యక్షులు ఎన్నికలు

**- ఎమ్మెల్యే శిరీష భాస్కర్**



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్:** మండల కేంద్రమైన రాజవొమ్మంగిలో మండల టిడిపి అధ్యక్షుడు ఎన్నిక నిర్వహించనున్నట్లు స్థానిక ఎమ్మెల్యే శిరీష భాస్కర్ తెలిపారు. స్థానిక ఆర్ 100 విజయంత తీసుకున్నారు ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ వద్దకు శుక్రవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు ప్రశాంత వాతావరణంలో ఎన్నిక నిర్వహించడం జరుగుతుందని ఆమె తెలిపారు.తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు,గ్రామ కమిటీల అధ్యక్షులు, గ్రామ కమిటీల ప్రధాన కార్యదర్శిలు, బూత్ ఇంచార్జీలు, యూనిట్ ఇంచార్జిలు, క్లస్టర్ ఇంచార్జిలు, అభిమానులు అందరూ తప్పకుండా హాజరై మండల పార్టీ అధ్యక్షులు ఎన్నికలు విజయవంతం చేయాలని ఎమ్మెల్యేశిరీష భాస్కర్ కోరారు. ఆగస్టు2న గంగవరం, 3న రంపచోడవరం, 4న దేవి పట్నం 5న మారేడుమిల్లి, 6న వైరామరం మండలాల్లో టిడిపి అధ్యక్షుడు ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే శిరీష భాస్కర్ తెలిపారు.

## జగ్గంపేట సీఐవై ఆర్ కె శ్రీనివాస్

## మహిళా పోలీస్ అవగాహన సదస్సు



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ వారు మహిళలు మరియు చైల్డ్ భద్రత రక్షణ విషయంలో అన్ని ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని చెప్పి ఆదేశాలు జారీ చేయడం జరిగింది. కిర్లంపూడి, జగ్గంపేట, గండేపల్లి మండలాల మహిళా సంరక్షణ కార్యదర్శులకు (మహిళా పోలీసులకు) జగ్గంపేట సర్కిల్ ఆఫీస్ వద్ద మోటివేషన్ సమావేశం ఏర్పాటు చేసిన జగ్గంపేట సీఐ. వై.ఆర్.కె.శ్రీనివాస్ +మీాఖలు అందరూ తమతమ గ్రామాల లోని మహిళా సోదరీ మణులు అందరూ మహిళలకు రక్షణ కవచంగా ఉన్న శక్తి యాప్‌ను డౌన్లోడ్ .రిజిస్ట్రేషన్ చేయించాలని వారికి మార్గ నిర్దేశం చేయడం జరిగిందిలి ప్రతి ప్రభుత్వ మరియు ప్రైవేటు విద్యాసంస్థ ల్లోనూ ఈగల్ క్లబ్ లు ఏర్పాటు చేయటం జరిగింది. మహిళా పోలీసులు తరచూ విద్యాసంస్థలను విజిట్ చేస్తూ ఈగల్ క్లబ్ సభ్యులతో మమేకమై విద్యాసంస్థలు మరియు పరిసరాలలో ఎటువంటి గంజాయి లాంటి మత్తు పదార్థాలు మత్తు పానీయాలు లేకుండా చూడాలని వారికి మార్గ నిర్దేశం చేయడం జరిగింది ప్రతి విద్యాసంస్థలలో మీటింగ్ లు పెడుతూ ఎటువంటి ర్యాగింగ్ కానీ, ఈవ్ టీజింగ్ కానీ లేకుండా చూడాలని వారిని కాటన్ జరిగింది. విద్యాసంస్థలు వదిలేటప్పుడు మరియు విద్యాసంస్థల విరామ సమయాలలో లోను ఖచ్చితంగా విద్యాలయాల దగ్గర ఉండి ఎటువంటి ర్యాగింగ్ ఈవ్ టీజింగ్ జరగకుండా విద్యార్థినీ లకు భరోసా కల్పించాలని వారిని రిక్వెస్ట్ చేయడం జరిగింది. ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్ 100 గజాల లోపులో సిగరెట్లు మరియు ఎటువంటి పొగాకు ఉత్పత్తుల అమ్మకాలు లేకుండా చూడాలని. ప్రభుత్వ మరియు ప్రైవేటు మహిళా బాలికల హాస్టల్స్ ను తరచూ విజిట్ చేస్తూ హాస్టల్ లో ఉన్నటువంటి విద్యార్థినీ లకు మీకు రక్షణ, భద్రత కోసం పోలీసులు, మహిళా పోలీసులు, శక్తి యాప్ ఉందని వారిలో చైతన్యం నింపండి.మీ మీ గ్రామంలలో క్రైమ్ ఎగైనెస్ట్ ఉమెన్ ఏవేర్నెస్ క్యాంపెయిన్స్ ఎక్కువగా పెడుతూ గ్రామాలలో మహిళల భద్రత మరియు రక్షణకు సంబంధించిన ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో జగ్గంపేట, కిర్లంపూడి గండేపల్లి కి చెందిన జగ్గంపేట సర్కిల్ +మీాఖ లు మహిళా పోలీసులు పాల్గొన్నారు.

# అంకిత భావంతో పని చేసిన వ్యక్తి డిప్యూటీ ఎంపీడీవో మేడవరపు సూర్య భాస్కరరావు



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** ఉద్యోగ భాధ్యతలను అంకిత భావంతో పని చేసిన వ్యక్తి మేడవరపు సూర్య భాస్కరరావు అని రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు, జగ్గంపేట ఎంపిపి అత్తులూరి నాగబాబు, నియోజకవర్గ అభివృద్ధి కమిటీ సభ్యులు, మండల టిడిపి అధ్యక్షులు మారిశెట్టి భద్రం అన్నారు. జగ్గంపేట మండల పరిషత్ కార్యాలయంలో డిప్యూటీ ఎంపిడిఓగా పని చేసిన సూర్య భాస్కరరావు గురువారం పదవి విరమణ చేశారు. స్థానిక గోకవరం రోడ్డులోని శివ పార్వతి ఫంక్షన్ హాల్ లో జగ్గంపేట ఎంపీడీవో ఏవీఎస్ చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించిన సన్మాన సభకు పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు హాజరయ్యారు. 1981 సంవత్సరంలో బిక్కవోలు మండలం పందలపాక గ్రామంలో లైబ్రేరియన్ జాయిన్ అయ్యిన సూర్య భాస్కరరావు వివిధ మండలాల్లో పంచాయితీ కార్యదర్శి గా పనిచేశారు. అలాగే ఈఓ పి ఆర్డీగా పదోన్నతి పొంది వివిధ మండలాల్లో పనిచేసి జగ్గంపేటలో పదవి విరమణచేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన సభలో మేడవరపు సూర్య భాస్కర రావు, నాగ సుజాత దంపతులను పూలమాలతో, శాలువాలతో సత్కరించి పలువురు జ్ఞాపిక అందించారు. ఈ సన్మాన సభలో అతిథులు మాట్లాడుతూ అతి తక్కువ సమయం జగ్గంపేటలో పనిచేసిన అందరి మన్ననలు పొందారని. అంకిత భావం, క్రమశిక్షణతో 43 సంవత్సరాలు ఉద్యోగ బాధ్యతలు నిర్వహించారని ఆయనతో పాటు వివిధ ప్రాంతాల్లో పనిచేసిన ఉద్యోగులు జగ్గంపేట చేరుకుని ఘనంగా సన్మానించారు. సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ 43 సంవత్సరాల సుదీర్ఘకాలం నాకు అన్ని విధాలా సహకరించిన నా సహచర ఉద్యోగులకు, ప్రజా ప్రతినిధులకు, రాజకీయ నాయకులకు, ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను అన్నారు. ఈ కార్యక్రమంలో జగ్గంపేట గండేపల్లి ఏపీవోలు, జగ్గంపేట పంచాయతీ సెక్రెటరీ శివ, రాజపూడి, మల్లిశాల, సర్పంచ్‌లు బుసాల విష్ణుమూర్తి, సర్వసిద్ధి లక్ష్మణరావు, తదితర సర్పంచ్లు, టిడిపి నాయకులు, మండలంలోని పంచాయతీ సెక్రెటరీలు,తదితరులు పాల్గొన్నారు.

# ఆదిత్య యూనివర్సిటీ ఇఇఇ విభాగంలో గెస్ట్ లెక్చర్



గండేపల్లి, మేజర్ న్యూస్ : సూరంపాలెంలో గల ఆదిత్య యూనివర్సిటీ నందు ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ వారిచే " ఎలిమెంటరీ ఫండమెంటల్స్ ఆఫ్ ఎంబెడెడ్ సిస్టమ్స్" అనే అంశంపై గెస్ట్ లెక్చర్‌ను నిర్వహించినట్లు కళాశాల ప్రో వైస్ –ఛాన్సలర్ (ఇంజనీరింగ్ & సైన్స్) డా. ఎ. రమేష్ తెలిపారు. ఈ సదస్సుకు అతిధిగా మైక్రో లింక్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, మేనేజింగ్ డైరెక్టర్, వి. గోవింద రావు పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి మాట్లాడుతూ ఈ సి ఈ విద్యార్థులకు ఎంబెడెడ్ సిస్టమ్స్ ఫండమెంటల్స్ మరియు నూతన ప్రాజెక్ట్స్ ఎలా అభివృద్ధి చేయవచ్చు అనే విషయాలు వివరంగా తెలుపుతూ విద్యార్థులకు ప్రాజెక్ట్ డెవలప్మెంట్ గురించి వివరించారు. ప్రో వైస్ –ఛాన్సలర్ డా.ఆదిరెడ్డి రమేష్ మాట్లాడుతూ ఈ టెక్నాలజీ ద్వారా భవిష్యత్తులో సమాజానికి ఉపయోగపడే అధునాతన ప్రాజెక్ట్ అభివృద్ధి చేయవచ్చని తెలిపారు.ఎలక్ట్రానిక్ డిపార్ట్మెంట్ విభాగాధిపతులు డా. ఆర్. వి.వి. కృష్ణ మరియు సిహెచ్ జానకి దేవి మాట్లాడుతూ విద్యార్థులందరూ ఎంబెడెడ్ సిస్టమ్స్ కోర్స్ ఉపయోగాలు వాటి వల్ల వచ్చే ఉద్యోగాలు అందిపుచ్చుకోవాలని వివరించారు. డీన్ అడ్మినిస్ట్రేషన్ డా. వై. సుబ్బారావు, డీన్ అకాడెమిక్ డా. పి.రవికుమార్ కోర్ బ్రాంచ్ యొక్క విశిష్టత గురించి వివరించారు. ఈ కార్యక్రమం అంతయు ఎలక్ట్రానిక్ డిపార్ట్మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. జి .శ్రీలక్ష్మి, వి.ప్రీతి ఆధ్వర్యంలో జరిగింది.

# రాజమండ్రిలో రిలయన్స్ ఫ్యాషన్ ఫ్యాక్టరీ స్టోర్ ప్రారంభం




**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** భారతదేశపు అతి పెద్ద రిటైల్ సంస్థ రిలయన్స్ మరో ముందడుగు వేసింది. రాజమండ్రిలో 'ఫ్యాషన్ ఫ్యాక్టరీ' పేరుతో తొలి స్టోర్‌ను ప్రారంభించింది. సెంట్రల్ జైలు రోడ్డులోని సెంట్రల్ వేర్‌హౌస్ ఎదురుగా ఉన్న ఈ స్టోర్ ప్రత్యేక ప్రారంభ ఆఫర్లతో వినియోగదారుల్ని ఆకర్షిస్తోంది. రూ.2499 విలువైన షాపింగ్ చేసిన వినియోగదారులకు అదే మొత్తానికి గాను ఉచితంగా దుస్తులు లభిస్తుండగా, రూ.2500 పైగా ఖర్చు చేసిన వారికి రూ.1445 విలువ చేసే 12 పీసుల డిన్నర్ సెట్ ఉచితంగా అందిస్తున్నారు. ఈ ప్రత్యేక ఆఫర్లు ఆగస్టు 2, 3 తేదీల్లో మాత్రమే వర్తిస్తాయి. మహిళలు, పురుషులు, పిల్లల కోసం విస్తృతమైన ఫ్యాషన్ కలెక్షన్‌ను ఈ స్టోర్‌లో అందుబాటులోకి తెచ్చారు. వెస్టర్న్, ఎథ్నిక్, క్యాజువల్, ఫార్మల్, అథ్లెషర్, స్పోర్ట్స్ వేర్ వంటి 20,000 పైగా స్టైల్స్‌ను కలిగి ఉన్న ఈ స్టోర్ ఒకే చోట పూర్తిస్థాయి షాపింగ్ అనుభవాన్ని కలిగించేలా రూపొందించబడింది. దుస్తులు, షూస్, హ్యాండ్‌బ్యాగ్స్, లగేజ్, యాక్సెసరీస్ తదితర వాటి ద్వారా పండుగల నుంచి పెళ్లిళ్ల వరకు అన్ని రకాల అవసరాలను తీర్చే సదుపాయం కలదు. రెండు వందలకు పైగా జాతీయ, అంతర్జాతీయ బ్రాండ్లతో 17,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటైన ఈ స్టోర్‌కు ఆధునిక ఇంటీరియర్, విభాగాల వారీగా షాపింగ్‌కు అనువైన ఏర్పాట్లతో వినూత్నతను తీసుకొచ్చింది. లెవీస్, పెపే, ప్యూమా, స్కెచర్స్, స్పైకర్, రేమండ్, పార్క్ అవెన్యూ, జాన్ ప్లేయర్స్, విశుధ్ వంటి ప్రముఖ బ్రాండ్లు ఇందులో అందుబాటులో ఉన్నాయి. 'బ్రాండ్స్ ఫర్ లెస్' అనే హామీతో సంవత్సరం పొడవునా 20 శాతం నుంచి 70 శాతం వరకు డిస్కౌంట్లు అందించే ఈ ఫ్యాషన్ ఫ్యాక్టరీ, రాజమండ్రి ప్రజలకు విలువైన ఫ్యాషన్ షాపింగ్‌ను అందించనుంది. శ్రేణిగా ప్రదర్శించే ధరలలో నాణ్యత కలిగిన బ్రాండెడ్ వస్తువులు అందుబాటులో ఉండటమే కాక, ప్రతి ఒక్కరికి సరిపోయేలా విభిన్న విభాగాల్లో ఎంపికలు ఉండడం ఈ స్టోర్ ప్రత్యేకత. వినియోగదారులకు ఉత్తమ అనుభవం కలిగించడమే లక్ష్యంగా ముందడుగులు వేస్తున్న రిలయన్స్ ఫ్యాషన్ ఫ్యాక్టరీ ప్రస్తుతం ప్రత్యేక ఆఫర్లతో షాపింగ్ ప్రియులకు పండుగ వాతావరణాన్ని కలిగిస్తోంది.

# మాజీ ఉపసర్పంచ్ ఏసుపాక వెంకటేశ్వర్లు గుండెపోటుతో మృతి



ఎటపాక, మేజర్ న్యూస్ : అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం గుండాల గ్రామ పంచాయతీ మాజీ ఉప సర్పంచ్, వైసీపీ సీనియర్ నాయకులు ఏ ఎ ు ా ె వెంకటేశ్వర్లు(62)గుండె పోటుతో హఠాత్ మరణం చెందాడు. వైసీపీ సీనియర్ నాయకులు ఏసుపాక వెంకటేశ్వర్లు నివాసానికి వెళ్లి అయన భౌతిక కాయని ఎటపాక జెడ్పీటీసి ఉబ్బా సుస్మిత,యంపీటీసి గొంగడి రామిరెడ్డి, మాజీ వైసీపీ మండల అధ్యక్షులు తానికొండా వాసు, వైసీపీ సీనియర్ నాయకులు ఉబ్బా సత్యం, ప్రధాన కార్యదర్శి యర్ర గొర్ల నరసింహరావు,మర్మం శంకర్ పలువురు వైసీపీ శ్రేణులు సందర్శించి నివాళులు అర్పి ంచారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులకు ఓదార్చి ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏసుపాక వెంకటేశ్వర్లు వైసీపీ అభివృద్ధిలో కీలక పాత్ర పోసించాడు అని,పంచాయతీ పరిధిలో వున్నా ప్రజలకు వివిధ శాఖల విషయంలో ఏ కష్టం వచ్చిన పరిష్కారించేవాడు అని, గ్రామ పంచాయతీ ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్య లను పరిష్కరించేవాడని వారు అన్నారు. ఏసుపాక మరణం పార్టీకి, గ్రామ పంచాయతీ ప్రజలకు తీరని లోటు అని వారు అన్నారు.ఏసుపాక వెంకటేశ్వర్లు అంత్యక్రియలు వైసీపీ శ్రేణులు, స్నేహితులు, బంధువులు అభిమానులు అశ్రునయనాల నడుము గురువారం జరిగాయి.

# జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీల్లో రాజవొమ్మంగి విద్యార్థులకు బంగారు పథకాలు



రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ : జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీలోరాజవొమ్మంగి జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులు బంగారు పథకాలు సాధించారు. రాజమహేంద్రవరం భగీరథ ఆర్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివి భగీరథి 125వ జన్మదిన వేడుకలు లో భాగంగా భగీరథి మనుమరాలు ఎన్ వి పి ఎస్ లక్ష్మి నిర్వహించిన రాష్ట్ర స్థాయి చిత్రలేఖనం పోటీల్లో స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థినులు బెస్ట్ చైల్డ్ ఆర్టిస్ట్అవార్డు, బంగారు పథకాలు, నగదు పొందారు. భూముల జీవన్ దుర్గేంద్ర ( 5వ తరగతి)బెస్ట్ చైల్డ్ ఆర్టిస్ట్ అవార్డ్ గోల్డ్ మెడల్, నగదు రాజమండ్రిలో శ్రీ చందా సత్రంలో జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో ఏ ఎస్ పి మురళీ కృష్ణ,ఉండవల్లి అరుణ్ కుమార్ చేతులమీదుగా అవార్డ్ అందుకున్నట్లు హెచ్ ఎం ఆదిలక్ష్మి తెలిపారు.

టి. హారిక (9వ తరగతి), ఎం హిమశ్రీ (8వ తరగతి), ఎల్. ఇందు (7వ తరగతి), కె సత్యన్నారాయణ ( 8వ తరగతి), బంగారు పతకాలు సాధించడం జరిగింది అన్నారు. ఈ సందర్భంగా హెచ్ ఎం ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ ఆదిలక్ష్మి మాట్లాడుతూ గురువుతో పాటు జాతీయ స్థాయి లో శిష్యులు జూనియర్ విభాగంలో బెస్ట్ చైల్డ్ ఆర్టిస్ట్ అవార్డ్ ను పొందడమే కాకుండా నలుగురు బంగారు పతకాలు పొందడం గర్వించదగ్గ విషయమన్నారు. పి ఎం సి చైర్మన్ ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ చిత్రలేఖనంలో మన పాఠశాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చినందుకు గర్వించ దగ్గ విషయమన్నారు. అనంతరం బహుమతులు విద్యార్థిని, విద్యార్దులకు అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో డ్రాయింగ్ టీచర్ మిరియాల కొండబాబు, టి.బొజ్జయ్య, విఘ్నేశ్వరరావు, స్వామి,పాల్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# రోటరీ క్లబ్ కాకినాడ గ్రీన్ సిటీ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం

**– ముఖ్య అదితిగా పాల్గొన్న అసిస్టెంట్ గవర్నర్ డా.సురభి**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ స్థానిక పిఆర్ డిగ్రీ కళాశాలలో గురువారం జరిగిన రోటరీ క్లబ్ కాకినాడ గ్రీన్ సిటీ కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ డాక్టర్ సురభి పాల్గొని రోటరీ క్లబ్ కాకినాడ గ్రీన్ సిటీ కమిటీ అధ్యక్ష కార్యదర్శులుగా జెట్టి పాండురంగారావు, సీనియర్ పాత్రికేయులు ఏ చిన్న బాబు మరియు కోశాధికారిగా ఉమామహేశ్వరరావు నూతన కార్యవర్గంచే ప్రమాణ స్వీకారం చేయించారు.
ఈ సందర్భంగా పలువురు రోటరీ క్లబ్ సీనియర్ మెంబర్లు మాట్లాడుతూ రోటరీ క్లబ్ కాకినాడ గ్రీన్ సిటీ ఏర్పడి సుమారు 11 సంవత్సరాలు కావస్తుందని ఇప్పటివరకు ప్రపంచ వ్యాప్తంగా ఏర్పడిన పోలియో నిర్మూలనకు రోటరీ క్లబ్ ఎంతగానో కృషి చేసిందని అలాగే రక్తదానం పచ్చని చెట్లు నాటడంతో పాటు, వివిధ అనేక సామాజిక కార్యక్రమాలను కార్యక్రమాలను ఇప్పటివరకు చేపట్టిందని తెలిపారు.
ఈ కార్యక్రమంలో కాకినాడ గ్రీన్ సిటీ కమిటీ రోటరీ ఫౌండేషన్ 10,250 రూపాయలు, పోలియో నిర్మూలన కొరకు 8,500 రూపాయల చెక్కులను అసిస్టెంట్ గవర్నర్ సురభికి అందజేశారు.
ఈ సందర్భంగా స్థానిక పిఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులను భాగస్వామ్యం చేస్తూ రెండు నూతన రోట్రాక్ట్ క్లబ్ లను ఏర్పాటు చేసి వారికి సమాజం పట్ల సేవా దృక్పథాన్ని, రక్తదానం, చెట్లు పెంపకం, మానవతా విలువలపై అవగాహన పెంపొందించుకునేలా పలువురు క్లబ్ సభ్యులు సూచనలు చేశారు. వీటికి కట్టుబడి వివిధ సామాజిక సేవలు అందించే విదంగా వారిచే ప్రతిజ్ఞ చేయించారు. అలాగే క్లబ్ కు దీర్ఘకాలంగా పలురకాల సేవలు అందించిన క్లబ్ సభ్యులకు కమిటీచే చిరు సత్కరం చేసి గౌరవించారు. ఈ కార్యక్రమంలో భమిటపాటి శ్రీకృష్ణ, ఆకెళ్ళ వీరభద్ర ప్రసాద్, అరిగెల శ్రీనివాస్, బ్లూ స్టార్ రవి కందాడ రవీంద్రనాథ్, ఆదినారాయణ, జిల్లా రొట్రాక్టు డి.ఆర్.ఆర్ హర్షిత, రాధిక, అధిక సంఖ్యలో పి.ఆర్. డిగ్రీ కళాశాల విద్యార్థి విద్యార్థునులు పాల్గొన్నారు. అలాగే ఇటీవల మరణించిన రోటరీ క్లబ్ పూర్వ గవర్నర్ ఆంజనేయ మూర్తికి సమావేశంలో రెండు నిమిషాలు మౌనం పాటించారు. సమావేశం చివరిగా నూతన కార్యదర్శి ఏ. చినబాబు వందన సమర్పణ చేశారు.

# రామచంద్రపురం ప్రజలకు ఉచిత న్యాయ సలహాలు

**– మంత్రి సుభాష్‌ను కలిసిన పలువురు న్యాయవాదులు**
**– మంత్రి క్యాంపు కార్యాలయంలో నెలలో ఒకరోజు లీగల్ సెల్**



**రామచంద్రపురం,మేజర్ న్యూస్ :** రామచంద్రపురం నియోజకవర్గ ప్రజలకు ఇకనుంచి ఉచితంగా న్యాయ సలహాలు, సూచనలు అందించేందుకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ చొరవ తీసుకున్నారు. ప్రముఖ న్యాయవాది లకాని పద్మ కమల కుమారి ఆధ్వర్యంలో గురువారం లీగల్ సెల్ కమిటీ (న్యాయవాదుల బృందం) మంత్రి సుభాష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.
ఈ సందర్భంగా మంత్రి సుభాష్ న్యాయవాదులతో పలు అంశాలపై చర్చించారు. నెలలో ఒకరోజు శని లేక ఆదివారాల్లో సమయం కేటాయించి లీగల్ సెల్ బృందం రామచంద్రపురం నియోజవర్గంలోని ప్రజలకు ఉచితంగా న్యాయ సలహాలు, సూచనలు ఇవ్వాలని నిర్ణయించారు. ఎవరికైనా న్యాయ సహాయం అవసరమైతే మంత్రి క్యాంపు కార్యాలయంలో సంప్రదిస్తే లీగల్ కమిటీ వారికి న్యాయ సహాయం అందిస్తారు. అనంతరం న్యాయవాదుల బృందం కూటమి పార్టీ సీనియర్ నాయకులు, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యంని కూడా మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ కార్యక్రమంలో జుత్తుక నాగేశ్వరరావు, వాసు, శర్మ, రామకృష్ణారెడ్డి, నిమ్మగడ్డ విజయ్, గోవిందాచార్యులు, గోపి, రవి, దొమ్మలపాటి సత్యనారాయణ తదితర న్యాయవాదులు ఉన్నారు.

# రాష్ట్ర ప్రగతి భావితరాల భవిష్యత్తు కోసమే

**– రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్**
**– సమస్యలు వింటూ..ప్రభుత్వ ఏడాది ప్రగతిని వివరిస్తూ..**
**స్కూలు విద్యార్థులతో ముచ్చటించిన మంత్రి**
**– విద్యార్థులతో కలిసి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం**



**రామచంద్రపురం, జులై 31** సుపరిపాలనలో తొలి అడుగు ప్రచార కార్యక్రమం గురువారం రామచంద్రపురం నియోజవర్గంలో ఉత్సాహంగా వినూత్నంగా సాగింది. కూటమి ఏడాది పాలనలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ.. కరపత్రాలు పంచుతూ ఉత్సాహంగా సాగింది. రామచంద్రపురం రూరల్ మాలపాడు గ్రామంలో సుపరిపాలలో తొలిఅడుగు కార్యక్రమాన్ని ప్రజలు విశేషంగా ఆదరించారు. మంత్రి సుభాష్ ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలు సానుకూలంగా విన్నారు. ప్రాధాన్యత క్రమంలో సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మాలపాడులోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో ముచ్చటించి, అక్కడ పరిస్థితులపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో కలిసి డొక్కాసీతమ్మ మధ్యాహ్న భోజనం చేశారు.
విద్యార్థినీ విద్యార్థులు ఉల్లాసంగా ఉత్సాహంగా మంత్రి సుభాష్‌తో ముచ్చటలాడారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రగతి భావితరాల భవిష్యత్తు కోసమే కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని, పని చేసే ప్రభుత్వానికి.. ప్రజల్ని విస్మరించిన దోపిడీదారులకు మధ్య ఉన్న బేధాన్ని రాష్ట్ర ప్రజలు గుర్తించారన్నారు. దేశ చరిత్రలో ఏ నాయకుడు ఇవ్వని సంక్షేమం సీఎం చంద్రబాబు తన ప్రజలకు అందిస్తున్నారని, చంద్రబాబు నాయకత్వంలో ఏ రాష్ట్రంలో లేని సంక్షేమం రాష్ట్ర ప్రజలకు అందుతోందని, తల్లికి వందనం, పింఛన్ల పంపిణీ, ప్రజా సంక్షేమానికి పాటుపడుతోందని అన్నారు. సుదీర్ఘ ప్రభుత్వం సమర్థ నాయకత్వంతోనే ప్రజల జీవితాల్లో మార్పులు చేకూర్తాయని, సమర్థవంతమైన నాయకత్వంతోనే పేదల జీవితాల్లో గొప్ప మార్పు వస్తుందని, రాష్ట్రం కూడా అన్ని విధాల అభివృద్ధి చెందుతుందని మంత్రి సుభాష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు కాకినాడ రామారావు, తెలుగుదేశం పార్టీ రూరల్, పట్టణ మండల అధ్యక్షులు కొత్తపల్లి శ్రీనుబాబు, శివ, కూటమి పార్టీ నాయకులు, గ్రామ అధ్యక్ష కార్యదర్శులు, బూత్, సెక్టార్ ఇన్చార్జిలు, డీసీలు, అనుబంధ సంస్థల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నేడే మధ్వసభ సమావేశం



**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఉత్తరాది మఠాధిపతులు శ్రీ సత్యాత్మ తీర్థ స్వామీజీ కాకినాడకు ఆగమిస్తున్న సందర్భంగా ఏర్పాట్లపై ప్రత్యేక సమావేశం కార్యదర్శి కోపల్లె శేషగిరిరావు అధ్యక్షతన ఆగస్టు ఒకటి శుక్రవారం సాయంత్రం 6 గంటలకు మధ్వసభలో జరుగుతుందని రాచూరి శేషగిరిరావు తెలిపారు. అందరూ పాల్గొనవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

## 'బాపనమ్మ' దేవస్థానం ధర్మకర్త ప్రమాణ స్వీకారం





**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** సీతపల్లి బాపనమ్మ దేవస్థానం ధర్మకర్తగా బీజేపీ నాయకురాలు కారు లక్ష్మి ప్రమాణ స్వీకారం చేసారు. అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం మండలం సీతపల్లి గ్రామంలో గిరిజన గ్రామ దేవత మాతృశ్రీ గడి బాపనమ్మ అమ్మవారి దేవస్థానం ధర్మకర్తగా రంపచోడవరం మండలం బిజెపి మహిళా మోర్చా అధ్యక్షురాలు కారు లక్ష్మి గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఎన్డీఏ భాగస్వామ్యంలో భాగంగా బిజెపి కి కేటాయించిన దేవాలయ ధర్మకర్త సభ్యురాలుగా ప్రమాణ స్వీకారం చేసిన కారు లక్ష్మిని ఏపీ ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జి రెడ్డి, బిజెపి నాయకులు కారం సీతారామన్న దొర (ఢిల్లీ బాబు), బిజెపి సీనియర్ నాయకులు ఈక బుల్లి కొండల దొర తదితరులు అభినందించారు. ఈ సందర్భంగా బాపనమ్మ దేవస్థానం ధర్మకర్త, బీజేపీ నాయకురాలు కారు లక్ష్మి మాట్లాడుతూ బిజెపి జాతీయ పార్టీ తనకు ఇచ్చిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, దేవస్థానం అభివృద్ధికి పాటుపడతామన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి స్వప్న కుమారి, జిల్లా కార్యదర్శులు కుండ్ల కృష్ణారెడ్డి, గురు ప్రసాద్, లోత భారతి, సోళ్ల రాణి, కుంజం ముత్యాల రావు దొర, సోళ్ల తేజ, సవిర్ల అబ్బాయి రెడ్డి, సారపు వీర ప్రతాప్ దొర, మడకం ప్రసాద్, కుండ్ల సాయిరాం రెడ్డి, కురసం రాజబాబు, సీనియర్ నాయకులు నక్క పైడయ్య, గుడ్ల అంక శ్రీనివాస్ రెడ్డి, నల్లమిల్లి వెంకట రామిరెడ్డి, ధర్మ ప్రచారక్ గుప్తా, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## నాటుసారాయిపై పోలీసుల దాడి



**సామర్లకోట,మేజర్‌న్యూస్:** డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ & ఎక్సైజ్ కాకినాడ వై.చైతన్య మురళి ఆదేశాల మేరకు, ప్రొహిబిషన్ & ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ ఎన్ఫోర్స్మెంట్ ఆఫ్ కాకినాడ వి.రేణుక పర్యవేక్షణలో, వి.రామకృష్ణ ఎఈఎస్, ఎన్ఫోర్స్మెంట్ కాకినాడ వారి ఆద్వర్యంలో సామర్లకోట మరియు పెద్దాపురం పట్టణ పరిధిలో గురువారం సిఎస్‌వో రైడ్ నిర్వహించి సామర్లకోట పట్టణ పరిధిలోని కుమ్మరివీధిలో 10 లీటర్ల నాటు సారాయితో గుబ్బల నాగరాజు (నాని) అను వ్యక్తిని మరియు పెద్దాపురం పట్టణ పరిధిలో దెయ్యాల అప్పలరాజు, దమ్ము దుర్గాప్రసాద్ అను ఇద్దరు వ్యక్తులను అదుపులో తీసుకుని వారి వద్దనుండి చెరొక 10 లీటర్ల వెరసి మొత్తం 20 లీటర్ల నాటుసారయిని స్వాధీనపరుచుకుని వారి ముగ్గురిని రిమాండుకు తరలించడమైనది. ఈ దాడులలో సిఐలు కె.రామ్మోహనరావు మరియు కె.వి.స్వామి, ఎస్సైలు ఎం.వి.వి.బి.కుమార్, బి.ఎన్.ఎస్.వరహాలు, కె.కల్యాణి మరియు సిబ్బంది పాల్గొన్నారని ఎఈఎస్, ఎన్ఫోర్స్మెంట్ కాకినాడ వి.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపినారు.